J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 06.03.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 40 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



• ఇతర రాష్ట్రాలకు...

## దశ.. 'దిశ'గా ఆంధ్రా

- పరిపాలన వికేంద్రీకరణ మార్గంలో పలు రాష్ట్రాలు
- 'దిశ' చట్టాన్ని ఆదర్శంగా తీసుకున్న మహారాష్ట్ర

*ఆయనకు ఏడు పదుల వయసు లేదు... నాలుగు పదుల రాజకీయ అనుభవం కూడా లేదు... 14ఏళ్ల పరిపాలనానుభవం అంతకన్నా లేదు.. ప్రపంచానికి పాఠాలు చెప్పినవాడు కాదు... బిల్‌గేట్స్‌కు కంప్యూటర్ నేర్పించిన వాడు కాదు.. సింధుకు షటిల్ బ్యాడ్మింటన్‌లో తర్ఫీదు ఇచ్చినవాడు కాదు... కోనేరు హంపికి చెస్ ఎలా ఆడాలో నేర్పినోడు కాదు..*

ఇవన్నీ లేకపోయినా, దశాబ్దాల అనుభవం లేకపోయినా కేవలం తొమ్మిదంటే తొమ్మిది నెలల పాలనాకాలంలోనే దేశంలోని ఇతర రాష్ట్రాలను తన రాష్ట్రం వైపు చూసేలా, తాను చేపడుతున్న కార్యక్రమాలను ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాలలో అమలు చేసేలా అడుగులు వేస్తున్న ఆ యువ ముఖ్యమంత్రే వైయస్ జగన్మోహన్‌రెడ్డి. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ముప్పావు ఏడాదే అయ్యింది. గత పాలనానుభవం లేదు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంత ఆశాజనకంగా లేదు, అయినా పథకాల అమలులో, పాలనా పరమైన నిర్ణయాలలో జెట్ స్పీడ్‌తో పోతున్నాడు.

(మిగతా 11వ పేజీలో)

• అటు విద్యార్థులకు.. ఇటు నేతలకు అగ్ని 'పరీక్ష'

## స్థానిక యుద్ధానికి సర్కార్ సిద్ధం?

- మనీ, మందు బందు
- కేడర్ కోలుకోక 'దేశం' దయనీయ స్థితి
- 90 శాతం స్థానాలపై వైసిపి దృష్టి
- వార్ వన్(వైసీపీ)సైడేనా?

ఓ పక్క రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు పరీక్షలు మొదలయ్యాయి, ఇదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు తెరలేపిన నవ్యాంధ్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తమ పార్టీ నేతలకు కూడా అగ్ని పరీక్ష పెట్టాడు. ఈ ఎన్నికలలో మనీ, మందు బందుచేసి 90శాతం పైన సీట్లను గెలవాలని నేతలకు టార్గెట్ పెట్టాడు. ఎక్కడైనా ఎక్కువ శాతం ఓటమి కలిగితే.. ఆ ప్రాంత శాసన సభ్యుడు తనను కూడా కలవక్కర్లేదని, నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా సమర్పించొచ్చని ఖరా కండీగా చెప్పేశాడు. విద్యార్థుల పరీక్షలు దేవుడెరుగు... నాయకుడు మనకు ఈ అగ్నిపరీక్ష పెట్టాడేంటిరా భగవంతుడా... అని నేతలు పరుగులు పెడుతున్నారు.

(మిగతా 11వ పేజీలో)




### లాయర్
### అంతర్జాతీయ మహిళా దినోత్సవం
### ఆహ్వానము

మార్చి



ఉదయం 10 గంటలకు

విపిఆర్ కన్వెన్షన్ సెంటర్, గొలగమూడిరోడ్డు, నెల్లూరు.

పూర్తి వివరాలు 3, 7 పేజీలలో..

# పంటొస్తుంది...
# పండగొస్తుందా..?

*వ్యవసాయం దండగ కాదు... వ్యవసాయమంటే పండుగగా భావించాలని దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి తరచూ చెప్పేవాడు. అయితే వ్యవసాయాన్ని పండుగ అనుకునే సందర్భాలు రైతుకు చాలా అరుదుగా వస్తుంటాయి. సకాలంలో వర్షాలు పడాలి, మంచి విత్తనాలు దొరకాలి, బ్యాంకులు ఋణాలివ్వాలి, ప్రభుత్వం సక్రమంగా కరెంట్ ఇవ్వాలి, సాగునీళ్లు అందించాలి, మధ్యలో వైపరీత్యాలు తలెత్తకుండా ప్రకృతి సహకరించాలి... ఇన్ని దశలు దాటి పంట చేతికొచ్చాక మార్కెట్‌లో పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు రావాలి. ఇన్ని దశలు దాటుకుంటేనే రైతుకు సేద్యం అన్నది పండుగే!*



రాష్ట్రంలో వైయస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రైతులు వ్యవసాయాన్ని పండుగలాగే చేసుకున్నారు. మళ్ళీ కొన్నేళ్ళ పాటూ దండగగా భావించే పరిస్థితులు రావడం తెలిసిందే!

కొన్నేళ్ళ విరామం తర్వాత రైతుల పరిస్థితి ఈ ఏడాదే కొంత ఆశాజనకంగా కనిపిస్తోంది. వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వేళావిశేషమేమోగాని గత ఏడాది సమృద్ధిగా వర్షాలు పడ్డాయి. జిల్లాలో సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లను నింపు కున్నాము. భూగర్భ జలాలు పెరిగాయి. పుష్కలంగా నీళ్ళుండడంతో జిల్లా వ్యాప్తంగా ఐదు లక్షల ఎకరాలలో రైతులు రబీసాగు చేశారు. మధ్యలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పంటలు కోతకు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా కోతలు మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 20లక్షల పుట్ల ధాన్యం అందుబాటులోకి వస్తోంది. రైతు కష్టాన్ని దళారుల పాలు కానీయకూడదని, వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. నెల్లూరు జిల్లాలోనే 200 దాకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

జిల్లాలో నెల్లూరు జిలకర(ఎన్ఎల్ఆర్ 34449) ఎక్కువగా పండిస్తారు. ఈ పంటకు బయట మార్కెట్‌లో దళారులు 12,500 రూపాయల నుండి 13వేల రూపాయలు ఇస్తుండగా, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రం 15,597 రూపాయల వంతున ధర ఇస్తున్నారు. దీంతో నెల్లూరు జిలకరను పండించిన రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దకే తీసుకెళ్తున్నారు. కాగా, జిల్లాలో షుగర్‌లెస్, బిపిటిలను కూడా కొద్ది విస్తీర్ణంలో పండించారు. అయితే, ఈ రకాలకు భవిష్యత్‌లో ఇంకా మంచి రేట్లు వస్తాయనే నమ్మకంతో రైతులు వాటిని 'రైతుబంధు' పథకం క్రింద గోడౌన్ లలో దాచుకుంటున్నారు.

ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర వల్ల రైతులకు న్యాయం జరిగింది. వారి కష్టానికి ప్రతిఫలం దక్కింది. ప్రభుత్వం తూతూ మంత్రంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించి వుంటే, మార్కెట్‌లో దళారులు చెప్పిందే ధరగా వుండేది, రైతుల కష్టం దళారుల పాలయ్యేది.

## వచన కవితా సంపుటాలకు ఆహ్వానం

తమ మాతృమూర్తి స్వర్గీయ పాతూరి మాణిక్యమ్మ సాహిత్య పురస్కారం కోసం 2019 సంవత్సరంలో ప్రచురితమైన తెలుగు వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నామని అవార్డు కమిటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు పాతూరి అన్నపూర్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలో విజేతకు 5 వేల రూపాయల నగదు బహుమతితో పాటు ఘనసన్మానం ఉంటుందని, కవులు రెండు కవితా సంపుటాలను ఏప్రిల్ 30 వ తేదీలోగా పంపవచ్చన్నారు. వివరాలకు డా. పాతూరి అన్నపూర్ణ, 1156-28-1 ప్రశాంతినగర్, నవలాకులతోట, నెల్లూరు-1, ఫోన్ 94902 30939, 97014 01173 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

**FORM IV**
(See Rule 8)
Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 2. Periodicity of its Publication | : | Weekly |
| 3. Printer's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. Publisher's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. Editor's Name | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. Name and Address of individuals who own the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : | Thunga Siva Prabhath Reddy |
| Nationality | : | Indian |
| Address | : | Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)
01.03.2020 **SIVA PRABHATH REDDY.T**

### హోటళ్ళలో
## ముమ్మరంగా తనిఖీలు

కనీస నాణ్యతా ప్రమాణాలు కూడా పాటించకుండా కేవలం ధనాశతో కొందరు హోటళ్ళ వ్యాపారులు వినియోగదారుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదులతో నెల్లూరులోని ఫుడ్ సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగారు.

ఈనెల 3న నగరంలోని పలు హోటళ్ళలో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొన్ని హోటళ్ళలో ఆహార నాణ్యత బాగా లేదని, నిల్వఉంచిన ఆహార పదార్థాలనును విక్రయిస్తున్నట్లు గుర్తించామని, ఇంకొన్ని హోటళ్లలో ఆహార పదార్థాల్లో అధిక మోతాదులో రంగులు కూడా కలుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు.

నిల్వ ఉంచిన ఆహారపదార్థాలను, ఏ మాత్రం నాణ్యత లేని ఆహారాన్ని గుర్తించి సీజ్ చేస్తున్నామన్నారు. ఆహారపదార్థాల విక్రయంలో నిబంధనలను అతిక్రమిస్తే అలాంటివారిపై చర్యలు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి శ్రీనివాస్ తదితరులు ఈ తనిఖీలు చేశారు.



### ఘాట్ దారుల్లో..
## నాటు ప్రయాణం

*నెల్లూరు - కడప జిల్లాల మధ్య వెలుగొండలు విస్తరించి వుండడం తెలిసిందే! నెల్లూరుజిల్లాకు పడమర వైపు అంతా కడపజిల్లా విస్తరించి వుండగా, ఈ రెండు జిల్లాలను కలుపుతూ జిల్లాలో మూడు ప్రధాన రహదారులున్నాయి. అందులో ఒకటి రాపూరు నుండి చిట్వేలు మీదుగా రాజంపేట వరకు వున్న ఘాట్‌రోడ్డు కాగా, ఇంకోటి సీతారాంపురం నుండి కడపజిల్లాలోని పోరుమామిళ్ళను కలిపే ఘాట్‌రోడ్డు. మూడోది నెల్లూరు నుండి కడపజిల్లాలోకి బద్వేలు వద్ద ప్రవేశించే ముంబయి జాతీయ రహదారి. ఇది నెల్లూరుజిల్లా నుండి కడప జిల్లాకే కాక కర్నూలు, అనంతపురం జిల్లా, కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలకు ప్రధాన అనుసంధాన రహదారిగా కూడా వుంది.*

అయితే అదే సమయంలో రాపూరు - చిట్వేల్ ఘాట్‌రోడ్డు రాపూరు, వెంకటగిరి, గూడూరు ప్రాంతవాసులకు, అలాగే సీతారాంపురం, పోరుమామిళ్ళ ఘాట్‌రోడ్డు ఉదయగిరి ప్రాంతం, అలాగే కడపజిల్లాలోని పోరుమామిళ్ళ, కలకపాడు ప్రాంతాల వాసులకు అటు ఇటు రాకపోకలు సాగించడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నెల్లూరుజిల్లా నుండి రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు వంటి ప్రాంతాలకు వెళ్లేవారికి రాపూరు ఘాట్‌రోడ్డు దగ్గర దారిగా వుంటోంది. అంతెందుకు కొన్నేళ్ల క్రితం ముంబై రహదారి సిమెంట్‌రోడ్డుగా మార్చడానికి మూసివేసినప్పుడు కడప జిల్లా వైపు నుండి కృష్ణపట్నం పోర్టుకు వచ్చే లారీలకు రాపూరు ఘాట్ రోడ్డే ప్రత్యామ్నాయంగా ఉపయోగపడింది.

అటు రాపూరు ఘాట్‌రోడ్డు కాని, ఇటు సీతారాంపురం, పోరుమామిళ్ళ ఘాట్‌రోడ్డులు గాని సింగిల్ రోడ్లుగానే వున్నాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు, లేదా రోడ్డు మీద వాహనాలు మరమ్మత్తులకు గురైనప్పుడు ఈ రోడ్ల మీద ట్రాఫిక్ ఆగిపోతోంది. దీనికితోడు ఈ ఘాట్‌రోడ్లలో చిరుతపులుల భయం కూడా వుంది. ద్విచక్రవాహనదారులు పెద్దసంఖ్యలోనే ఈ రూట్లలో తిరుగుతుంటారు. సింగిల్‌రోడ్లుగా వున్న ఈ ఘాట్‌రోడ్లను విస్తరించగలిగితే ఘాట్ రోడ్లపై ప్రయాణం నాటుగా కాకుండా హాయిగా వుంటుంది.

## విజయవంతంగా ఇంటి వద్దకే ఫించన్

నెల్లూరు నగరంలో ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్దిదారుల ఇళ్ల వద్దకే వెళ్ళి వార్డు వలెంటీర్లు ఫించన్ పంపిణీ చేశారు. ఈనెల 1, 2వ తేదీలలో దాదాపు 92శాతం పెన్షన్ల పంపిణీని పూర్తి చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో 17,489 వృద్ధాప్య, 4,329 దివ్యాంగ, 17,399 వితంతు, 1,049 ఒంటరి మహిళ, 632 ఇతర ఫించన్ లబ్దిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ. 11.35 కోట్ల నగదును ఫించన్ కింద అందజేస్తున్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు, పథకాలు అందించే లక్ష్యంతో వైస్సార్‌సీపీ ప్రభుత్వం వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే అందజేసేందుకు కార్పొరేషన్ పరిధిలో 3040 మంది వలంటీర్లను నియమించింది. ఒక్కో వలంటీరుకు 100ఇళ్ళు కేటాయించింది. కార్పొరేషన్ కమిషనర్ పీవీవీయస్ మూర్తి, ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ ప్రసాద్ పర్యవేక్షణలో వార్డు సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో వార్డు వలంటీర్లు ఈనెల 1,2 తేదీల్లో ఫించన్లు పంపిణీని పూర్తి చేశారు. ఫించన్‌దారులు అందుబాటులో లేకపోవడంతో మిగిలిన 8 శాతం పంపిణీని పూర్తి చేయలేకపోయినట్లు అధికారులు తెలిపారు.

### అంతరిక్ష పరిశోధనలపై
## విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ముఖాముఖి కార్యక్రమాలు దోహదపడతాయని, అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు మక్కువ పెంచుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజశేఖర్ పేర్కొన్నారు. ఈనెల 2న షార్‌లోని కల్పనా అతిథి గృహంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సూళ్ళూరుపేట మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన 99 మంది విద్యార్థులు, 10 మంది ఉపాధ్యాయులు ముఖాముఖికి హాజరయ్యారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేస్తున్న ప్రయోగాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు షార్ డైరెక్టర్ సమాధానం ఇచ్చారు. ఇప్పటివరకు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులతో మాత్రమే కార్యక్రమాలు నిర్వహించామని, ప్రస్తుతం సూళ్ళూరుపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పించామని ఈ సందర్భంగా డైరెక్టర్ తెలిపారు.

# లాయర్
# ఆహ్వానము








## లాయర్
వారపత్రిక ఆధ్వర్యంలో

## "అంతర్జాతీయ మహిళా దినోత్సవం"

మార్చి 8, 2020 ఆదివారం ఉదయం 10గంటలకు
నెల్లూరు, గొలగమూడిరోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగును.



ఈ సందర్భంగా, భారత ఉపరాష్ట్రపతి గారి సతీమణి
**శ్రీమతి ముప్పవరపు ఉషమ్మ గారికి**
గౌరవ సత్కారం జరుగును.

ఈ కార్యక్రమానికి
ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకురాలు
**శ్రీమతి గునుపాటి పింకిరెడ్డి గారు**
అధ్యక్షత వహిస్తారు.

తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి సభ్యురాలు
**శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గారు**
జ్యోతిప్రజ్వలన గావిస్తారు.

ఈ మహోత్సవంలో
**శ్రీమతి అల్లారెడ్డి నీనరెడ్డి గారు**
జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, 'సవేరా' గ్రూప్ ఆఫ్ హోటల్స్
**శ్రీమతి ఇమ్మణ్ణి దీపావెంకట్ గారు**
మేనేజింగ్ ట్రస్టీ, స్వర్ణభారత్ ట్రస్ట్
**శ్రీమతి యస్.పి.శైలజ గారు**
ప్రముఖ సినీ గాయనీమణి
**శ్రీమతి నూకలపాటి పార్వతిరెడ్డి గారు**
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, NAR ఇన్‌ఫ్రా ప్రై. లి.
గౌరవ అతిథులుగా పాల్గొంటారు.

ఈ వేడుకలో లాయర్ వారపత్రిక ప్రచురించిన
'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు'
ప్రత్యేక సంచిక ఆవిష్కరించబడును.

**అందరూ ఆహ్వానితులే!**



## 'ప్రభా'తం

# పైశాచికానికి పరాకాష్ట

ప్రపంచంలో 194 దేశాలున్నాయి. ఏ దేశమైనా చొరబాటుదారులకు ఎర్రతివాచీలు పరుస్తుందా? ఏ దేశమైనా అక్రమంగా తమ దేశంలోకి చొరబడేవారికి తమ దేశపౌరులతో సమానంగా హక్కులు కల్పిస్తుందా? వీసా అన్నది లేకుండా ఏ దేశంలోనైనా పరాయి దేశస్థుడు అడుగుపెట్టగలడా? ఒక్క భారతదేశంలో మాత్రమే ఇలాంటివి కనిపిస్తుంటాయి. పాస్‌పోర్టు, వీసాల వంటివి లేకుండా కోట్ల సంఖ్యలో ఇతర దేశస్థులు ఈ దేశంలోకి చొరబడ్డారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, మయన్మార్ వంటి దేశాల నుండి అక్రమంగా చొరబడి పశ్చిమబెంగాల్, అస్సాం వంటి రాష్ట్రాలలో పాతుకుపోయినవాళ్ళు కోట్లలోనే వున్నారు.

ఒక భారతీయుడిని ఏ దేశం కూడా వీసా లేకుండా తమ భూభాగంలోకి అనుమతించదు. అలాంటిది భారతదేశంలోకి మాత్రం చొరబాటుదారులను ఎందుకు అనుమతించాలి? ఈ దేశంలో ఇప్పుడున్న జనాభాకే తిండి, బట్ట, నీడ సరిగా కల్పించలేని పరిస్థితి. ఇప్పుడున్న వారికే ఉపాధి అవకాశాలు కల్పించలేని దుస్థితి.

అందుకే చొరబాట్లకు అడ్డుకట్ట వేసే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం సిఏఏ, ఎన్‌సిఆర్, ఎన్‌పిఆర్ బిల్లులను తీసుకొచ్చింది. జాతీయ పౌరసత్వ కార్డు అన్నది ప్రతి దేశంలోనూ వుండేదే! ఆఖరుకు పాకిస్థాన్ లోనూ జాతీయ పౌరసత్వ గుర్తింపు కార్డులను ప్రజలకిచ్చి వున్నారు. అమెరికాలో 'గ్రీన్‌కార్డు'ను పౌరసత్వ కార్డుగా పరిగణిస్తుండడం తెలిసిందే!

స్వాతంత్ర్యానంతరం భారతదేశం భారత్, పాకిస్థాన్‌గా విడిపోయింది. పాకిస్థాన్ మత పరమైన రాజ్యంగా విడిపోయినప్పటికీ భారత్‌ను లౌకిక రాజ్యంగానే వుంచారు. స్వాతంత్ర్యానంతరం పాకిస్థాన్ ముస్లిం మత రాజ్యంగా ఏర్పడ్డప్పటికీ ఎంతో మంది ముస్లింలు భారత్‌లోనే వుండిపోయారు. భారత్‌నే తమ మాతృదేశంగా భావిస్తున్నారు. అప్పటి నుండి వాళ్ళు భారతీయులుగా ఈ దేశ ప్రగతి పునాదులలో నిర్మాణకర్తలయ్యారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యారు. దాదాపు ఏడు దశాబ్దాలుగా ముస్లింలు, ఇతర మైనార్టీలు ఈ దేశంలో జరిగే ప్రతి ఎన్నికలలోనూ ఓట్లేస్తున్నారు. హక్కులు అనుభవిస్తున్నారు. సిఏఏ, ఎన్‌సిఆర్ వంటి బిల్లుల వల్ల అలాంటి భారతీయ ముస్లింలకు వచ్చిన నష్టమేమీ లేదు. ఈ దేశ ప్రజాస్వామ్య ప్రక్రియ నుండి వారిని వేరు చేసి చూడలేము. ఈ బిల్లుల ఉద్దేశ్యమల్లా చొరబాటు దారులను నియంత్రించడం, అక్రమ చొరబాటుదారుల వల్ల పశ్చిమ బెంగాల్, అస్సాంలలో ఎంతటి అరాచకాలు జరుగుతున్నాయో చూస్తూనే వున్నాం... చొరబాటు దారులకు స్థానికులకు మధ్య గొడవలు జరుగుతూనే వున్నాయి.

భవిష్యత్‌లో ఇది తీవ్రరూపం దాల్చకముందే చొరబాట్లను అడ్డుకోవాలి. ఈ ఉద్దేశ్యంతో తెచ్చిన బిల్లులపై సరైన అవగాహన కల్పించడంలో అటు కేంద్రప్రభుత్వం విఫలం కాగా, ఇటు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏ బిల్లు తెచ్చినా గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న విపక్షాలు ఈ బిల్లుల పట్ల మైనార్టీలలో లేనిపోని భయాందోళనలు రెచ్చగొట్టి మంటలను ఎగదోశాయి. గత కొంతకాలంగా దేశ వ్యాప్తంగా సిఏఏ, ఎన్‌ఆర్‌సి బిల్లులకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహిస్తుండడం చూస్తూనే వున్నాం. ఈ బిల్లులను వెనక్కు తీసుకునే ప్రశ్నే లేదని కేంద్రం స్పష్టం చేసింది. అదే సమయంలో విపక్షాలు సైతం మైనార్టీలకు వెన్నుదన్నుగా నిలుస్తూ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను తీవ్రతరం చేసేపనిలో వున్నాయి. కాని ఈ ఆందోళనలే దేశ రాజధాని నగరంలో హింసాత్మక రూపం సంతరించుకోవడం విచారించాల్సిన విషయం. సిఏఏ, ఎన్‌సిఆర్ బిల్లులకు వ్యతిరేకంగా ముస్లింలు ఆందోళన నిర్వహిస్తున్న నేపథ్యంలో కొందరు రాజకీయ నాయకుల వివాదాస్పద రెచ్చగొట్టే ప్రకటనల వల్ల అల్లర్లు చెలరేగి 40మందికి పైగా మృత్యువాత పడ్డారు. వీరిలో విద్రోహులు జరిపిన కాల్పుల్లో ఒక కానిస్టేబుల్ మరణించారు. కాగా, అంకిత్‌శర్మ అనే ఐబి అధికారిని ఆందోళన కారులు కిడ్నాప్‌చేసి కత్తులతో 400 పోట్లు పొడిచి అత్యంత దారుణంగా చంపిన తీరు సభ్య సమాజాన్ని వణికేలా చేసింది. ఇంతటి కిరాతక చర్యలను ఉపేక్షిస్తే రేపు సమాజానికి ఎంతో ప్రమాదం.

1984లో సిక్కు అల్లర్ల తర్వాత దేశ రాజధానిలో ఆ స్థాయిలో అల్లర్లు జరగడం ఇప్పుడే! ఇందిరాగాంధీ హత్యానంతరం అప్పుడు ప్రభుత్వమే అక్కడ దమనకాండ సాగించింది. కాంగ్రెస్ నాయకులే పోలీసుల సహకారంతో సిక్కుల ఊచకోతకు పాల్పడ్డారు. మానవత్వం అన్న కోణాన్ని ఆరోజు కాంగ్రెస్‌వాళ్ళు విడిచిపెట్టేశారు. ఈరోజు ఢిల్లీ అల్లర్లకు కేవలం నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలే ప్రధాన కారణంగా తెలుస్తోంది. బీజేపీకి చెందిన ఒక నాయకుడు, అలాగే 'ఆప్' మాజీ కార్పొరేటర్ రెచ్చగొట్టే చర్యల మూలంగానే ఢిల్లీ భగ్గున మండింది.



1984లో సిక్కు అల్లర్ల తర్వాత దేశ రాజధానిలో ఆ స్థాయిలో అల్లర్లు జరగడం ఇప్పుడే! ఇందిరాగాంధీ హత్యానంతరం అప్పుడు ప్రభుత్వమే అక్కడ దమనకాండ సాగించింది. కాంగ్రెస్ నాయకులే పోలీసుల సహకారంతో సిక్కుల ఊచకోతకు పాల్పడ్డారు. మానవత్వం అన్న కోణాన్ని ఆరోజు కాంగ్రెస్‌వాళ్ళు విడిచిపెట్టేశారు. ఈరోజు ఢిల్లీ అల్లర్లకు కేవలం నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలే ప్రధాన కారణంగా తెలుస్తోంది. బీజేపీకి చెందిన ఒక నాయకుడు, అలాగే 'ఆప్' మాజీ కార్పొరేటర్ రెచ్చగొట్టే చర్యల మూలంగానే ఢిల్లీ భగ్గున మండింది.

ఢిల్లీ అల్లర్లలో పోలీసు ప్రేక్షక పాత్రను కూడా ప్రశ్నించాల్సి వస్తోంది. ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలు వెలువడి నెలరోజులు కూడా కాలేదు. అరవింద్ కేజ్రీవాల్ సర్కార్‌కు ఇది తొలిదెబ్బగా, మాయని మచ్చగా అనుకోవచ్చు. ఢిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొల్పడానికి కేంద్రం ప్రత్యేక బలగాలను రంగంలోకి దించింది. కేంద్ర ప్రభుత్వమైనా, విపక్షాలైనా అల్లర్లను, ఆందోళనలను ఎగదోసే విధంగా కాకుండా సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచించాలి. భారతీయ ముస్లింలను ఇబ్బంది పెట్టకుండా చొరబాటుదారులను మాత్రమే లక్ష్యంగా చేసుకునేలా బిల్లుల స్వరూపాన్ని మార్చాలి.

# శ్రీ రంగనాథుని తిరునాళ్ళు చూతము రారండి..

- **9వ తేదీ రాత్రి బంగారు గరుడసేవ**
- **11వ తేదీ రథోత్సవం**



ప్రతి ఏడాది నెల్లూరు రంగనాయకుల పేటలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రంగనాథుని తిరునాళ్ళు ఈ నెల 4 నుండి వైభవంగా ప్రారంభమయ్యాయి. పినాకినీ నదీ తీరాన ఉత్తర శ్రీరంగంగా వెలుగొందు తున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి తిరునాళ్ళకు జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారు. విద్యుద్దీపాలంకరణలతో, విశేష పుష్పాలంకరణలతో నయనానందకరంగా లోక కల్యాణార్థమై జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 4న సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. 5న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం శేషవాహన ఉత్సవాలు కనులవిందుగా జరిగాయి. 6న ఉదయం సూర్యప్రభ, రాత్రి హంసవాహన ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి, 7న ఉదయం సింహవాహనం, రాత్రి చంద్రప్రభ, 8 న ఉదయం పల్లకి (వెణ్ణత్తాళి), రాత్రి హనుమంతసేవ, 9న ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం పూలంగిసేవ, రాత్రి బంగారు గరుడసేవ, 10 న సాయంత్రం 4 గంటలకు స్వామి అమ్మవార్లకు పూలంగిసేవ, 6 గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 2 గంటలకు గజ వాహనసేవ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 11వతేదీ ఉదయం 6 గంటలకు శ్రీస్వామి అమ్మవార్లకు, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్లకు పుష్పాలంకారం, ఉదయం 8.30 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు పొన్నవాహనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 12న మధ్యాహ్నం 2 గంటలకు తిరుప్పాయ్ నాడల్, రాత్రి 7 గంటలకు అశ్వవాహనం, 13న ఉదయం మునుగుల సేవ, సాయంత్రం పుణ్యకోటి విమానం, 14 న సాయంత్రం పుష్పయాగం, రాత్రి 8 గంటలకు దవనోత్సవము. రాత్రి 10.30 గంటలకు ధ్వజావరోహణము, 15న రాత్రి 7 గంటలకు తెప్పోత్సవ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఛైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

### తుమ్మగుంట బ్రాహ్మణ సంఘం
## నూతన కార్యవర్గం

నెల్లూరు వేదాయపాళెం ఎఫ్‌సీఐ కాలనీలోని తుమ్మగుంట బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో ఈనెల 1న తుమ్మగుంట బ్రాహ్మణ సంఘ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘ వ్యవస్థాపకుడు పాటూరు వెంకటరామ సుబ్రహ్మణ్య ప్రసాద్ ఆధ్వర్యంలో శాశ్వత గౌరవాధ్యక్షుడు మాచవోలు కోటేశ్వరశర్మ పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా పాటూరు రామశేషు, ఉపాధ్యక్షులుగా అరిశా రామచంద్రమూర్తి, కార్యదర్శిగా మాచవోలు భాస్కరశర్మ, ఉప కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా భట్టారం సుబ్బు శ్రీనివాసులు, ఐదుమంది కార్యవర్గ సభ్యుల్ని ఎన్నుకున్నారు.

## సబ్‌రిజిస్ట్రార్‌పై వేటు

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, నిబంధనలను ఉల్లంఘించడంలో నాయుడుపేట సబ్‌రిజిస్ట్రార్ రోహిణిని సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ డిఐజి అబ్రహం తెలిపారు. ఆమె బుజబుజనెల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసినప్పుడు దేవాలయ భూములు, ఇతర నిషేధిత భూములు రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలడంతో ఆమెపై వేటు వేశారు.

## మంచి ఆలోచన

గ్రామాలలో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలనే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనకు అభినందనలు. గ్రామాలలో విద్య, వైద్య సదుపాయాలు లేకపోవడం వల్లే పల్లెవాసులు పట్టణాలకు తరలిపోతున్నారు. గ్రామాలలో వుండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసేవైద్య సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకపోతుండడంతో అత్యవసర సమయాలలో ప్రజలు వైద్య సేవలు అందక ప్రాణాలు కోల్పోతున్నారు. గ్రామాలలో వైద్య సిబ్బంది అందుబాటులో వుండే విధంగా కూడా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవాలి.

**– ఏగుల మహేశ్వరి, రాజుపాలెం.**

## కారకులను శిక్షించాలి

ఢిల్లీలో అల్లర్లకు కారకులైన వారిని శిక్షించాలి. 40 మందిని అన్యాయంగా పొట్టనపెట్టుకున్నారు. ఐబి అధికారిని చంపిన తీరు మరీ దుర్మార్గం. ఆయనను చంపిన వాళ్లను నడిరోడ్డు మీద ఉరితీయాలి. మతాల కంటే దేశ భద్రత ముఖ్యం, మత పరంగా జరిగే హింసోన్మాదాన్ని అరికట్టే దిశగా ప్రభుత్వ చర్యలుండాలి.

**ఎస్‌కె నాగూర్‌వలి, నెల్లూరు.**

## మూఢత్వాన్ని తరిమికొట్టండి!




ఒకప్పుడు భూతాలు, ఆత్మలు, చేతబడులు అనే మూఢాచారాలను హిందువులు నమ్మేవాళ్ళు. కొందరు భూతవైద్యులు, బాబాలు, దొంగ స్వామీజీలు వారి మూఢాచారాలను సొమ్ము చేసుకునే వాళ్ళు. ఇప్పుడు దెయ్యాలగోల క్రైస్తవ మతంలో ఎక్కువయ్యింది. ప్రతి పాస్టర్ కూడా చర్చిలలో తన మనుషుల చేత దెయ్యాలు పట్టినట్లు, తన మంత్రశక్తితో వాటిని వదిలిస్తున్నట్లు నాటకాలాడుతుంటాడు. అసలు వీళ్ళు పలికే పిచ్చి భాష నిజంగా దెయ్యాలుంటే వాటికి అర్ధమవుతుందా? తెలుగు మాత్రమే తెలిసి చనిపోయి, ఆత్మలైన వారికి వీరి పిచ్చి భాషలు అర్ధం కావుకదా? ముందు దేవుడు, దెయ్యాలపేరుతో జరిగే ఇలాంటి మోసాలను అరికట్టాలంటే ప్రజలు చైతన్యవంతులు కావాలి. మూఢత్వపు ఆలోచనల నుండి బయటపడి శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి. కొంతమంది పాస్టర్లు ప్రపంచంలో ఎలాంటి సమస్యనైనా తమ మంత్ర శక్తితో పరిశుద్ధ జలంతో పరిష్కారం చూపుతామంటున్నారు. మరి వీళ్ళు తమ మహిమలను ఉపయోగించి కరోనా వైరస్‌ను అరికట్టి లక్షల మంది ప్రాణాలను కాపాడవచ్చుకదా!

**– వై.నాగిరెడ్డి, నెల్లూరు.**

## శ్రీసిటీలో..

# ఈఎస్ఐ ఆస్పత్రి పెడుతున్నారా?

**- రాజ్యసభలో విపిఆర్**



నెల్లూరు జిల్లా శ్రీసిటీ వద్ద కొత్త ఈఎస్ఐ హాస్పిటల్ మంజూరు విషయమై రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 4వ తేదీన రాజ్యసభలో ప్రశ్నించారు. హాస్పిటల్ నిజమే అయితే ఎన్ని బెడ్లతో హాస్పిటల్‌ను ఏర్పాటు చేస్తున్నారు, అందులో ఏఏ విభాగాలు ఉంటాయి, వైద్య సదుపాయాలు ఎలా ఉంటాయి, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ఎంత అని ఆయన అడిగారు.

కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సంతోష్‌కుమార్ దీనికి సమాధానం ఇస్తూ శ్రీసిటీ వద్ద వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయడం జరిగిందని, ఇందులో ఓపి మరియు ఇన్ఫెక్షన్ సదుపాయాలు ఉంటాయని, జనరల్ మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్, గైనకాలజీ, ఈఎన్‌టి, చర్మ, కంటి వైద్య విభాగాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం భూమి కేటాయింపు దశలో ఉందని పేర్కొన్నారు.

అలాగే పెండింగులో ఉన్న ప్రధానమంత్రి ఉజ్వల యోజన దరఖాస్తుల గురించి కూడా అడిగారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమాధానమిస్తూ దేశవ్యాప్తంగా పియంయువై కింద ఎనిమిది కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు విడుదల చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 7కోట్ల కనెక్షన్లు విడుదల చేయడం జరిగిందన్నారు.

3వ తేదీ జరిగిన చర్చలో ఆయన ఇంధన ఉత్పత్తి సామర్థ్యంపై ప్రశ్నించారు. అలాగే దేశంలో సి సెక్షన్ జననాలు గత దశాబ్దంలో రెట్టింపైన విషయం గురించి ప్రశ్నించారు. సి సెక్షన్ జననాల వార్షిక పెరుగుదలను ప్రభుత్వం ఎలా చూస్తుందని, దీనిని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఆమోదించిన స్థాయికి తీసుకురావడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారని అడిగారు. ఆయుష్మాన్ భారత్ నుండి సిజేరియన్‌లను తొలగించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందా అని ఆయన ప్రశ్నించారు. దీనికి కేంద్రమంత్రి అశ్విన్‌కుమార్ చౌబే సమాధానమిస్తూ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో సిజేరియన్ ద్వారా జననాలు ప్రపంచ సగటుతో సమానంగా ఉన్నాయని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం సహజ జననాలను ప్రోత్సహించేందుకు మరియు సానుకూల ప్రసవ అనుభూతిని కల్పించేందుకు మిడ్ వైఫరీ ఇన్సియేటివ్ ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

అంతకు ముందు 2వ తేదీ జరిగిన సభలో బొగ్గు ఉత్పత్తికి సంబంధించిన వివరాలు అడిగారు. అలాగే దొనకొండ వద్ద హెలికాప్టర్‌ల పైలెట్ల శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయాలని, అమరావతి వద్ద సైబర్ సెక్యూరిటీ సెంటర్ వంటివాటి గురించి కూడా ఆయన ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టారు.

# కష్టంగా రిజిస్ట్రేషన్లు

## • నష్టాల్లో రియల్టర్లు




***ఈరోజు దేశంలో, రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న రంగం రియల్‌ఎస్టేట్. రెండు, మూడు దశాబ్దాల క్రితం ఈ రంగానికి పెద్ద ప్రాధాన్యత వుండేదికాదు, ఆర్థిక స్థితిగతులపై పెద్దగా ప్రభావం చూపేది కూడా కాదు. కాని, ఎప్పుడైతే 'స్థలం' అనే దానిని ప్రజలు పెట్టుబడి రూపంలోకి మలచుకున్నారో, అప్పుడే దాని ప్రాధాన్యత పెరిగింది. ఈరోజు దేశ ఆర్థిక ప్రగతిలో ఇదొక ముఖ్యభాగమైంది.***

వ్యవసాయ ఉత్పత్తులు బాగుంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా వున్నట్లు. ఈ కోవలోనే రియల్‌ఎస్టేట్ రంగం కూడా రాష్ట్ర, దేశ ఆర్థిక పరిస్థితులపై ప్రభావం చూపిస్తోంది.

గత పదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌లో రియల్‌ఎస్టేట్ ఏమంత వూపుగా లేదు. రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ నిర్ణయాలు, రాజధాని ఎంపిక వంటి అంశాలు కూడా రియల్ ఎస్టేట్ రంగంలో మార్పులకు కారణమవుతున్నాయి. ఏ ప్రభుత్వమైనా రియల్ ఎస్టేట్ రంగానికి కొన్ని సడలింపులిస్తేనే వ్యాపారం జోరందుకుంటుంది. తద్వారా రిజిస్ట్రేషన్‌లు పెరిగి ప్రభుత్వ ఆదాయం కూడా రెట్టింపవుతుంది.

కాని, రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక రియల్‌ఎస్టేట్ రంగంలో వరకు కొంత ప్రతిష్టంభన ఏర్పడింది. రియల్‌ఎస్టేట్‌లో ఇంతవరకు సక్రమ వ్యాపారంకంటే అక్రమ వ్యాపారం ఎక్కువుగా వుండేది. అధికార లే అవుట్ల కంటే అనధికార లే అవుట్లు ఎక్కువుగా వుండేవి. ఇలా వుండబట్టే రియల్ ఎస్టేట్‌లో అవినీతి సంపాదన కూడా ఎక్కువుగా వుండేది.

ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రియల్ ఎస్టేట్‌ను సక్రమ మార్గంలో పెట్టాలని చెప్పి రియల్టర్లను ఒక చట్రంలో ఇరికించేశాడు. అనుమతి వున్న లే అవుట్లలో ఫ్లాట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్‌లకు అనుమతించారు. అనధికార లే అవుట్లలో ఫ్లాట్లకు 7 నుండి 14 శాతం వరకు టాక్స్ కట్టాలి. ఈ కొత్త నిబంధనలతో నెల్లూరుజిల్లాలో అంతంత మాత్రంగా వుండిన రియల్ ఎస్టేట్ మార్కెట్ పూర్తిగా స్థంభించిపోయింది. జిల్లాలో ఎక్కువుగా అనధికార లే అవుట్లే వున్నాయి. ఆరు నెలల క్రితం కొన్ని లే అవుట్లను 'నుడా' అధికారులు తవ్వేయడంతో రియల్ ఎస్టేట్ మార్కెట్ అప్పుడు కొంత దెబ్బతింది. ఇప్పుడు అనధికార లే అవుట్లకు కూడా ఎల్‌ఆర్‌ఎస్ స్కీంలో ఫీజు కట్టాక రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది.

గతంలో ఎంతో మంది అనుమతి లేని లే అవుట్లలో ఫ్లాట్లు కొనుగోలు చేసి వున్నారు. వాళ్ళు కూడా ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ కట్టి ఫ్లాట్లను క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం కల్పించారు. అయితే గతంలో వాళ్ళు ఫ్లాటును కొన్న ధర కంటే కూడా ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ క్రింద కట్టాల్సిన ఫీజు ఎక్కువుగా వుంటుండడంతో గుడ్లు తేలేస్తున్నారు. ఎందుకంటే అప్పట్లో చౌకగా కొనుంటారు. ఇప్పుడు స్థలాల రిజిస్ట్రేషన్ ధరలు పెరిగి వుంటాయి. లే అవుట్లకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు లక్షలు కోట్లలో వుంటుండేసరికి రియల్టర్లు బావురుమంటున్నారు.



## ఆనం ఇంట మేకపాటి

రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి గత నెల 28న నెల్లూరు, సంతపేటలోని వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఇంటికొచ్చారు. పలు అంశాలపై ఇరువురూ మాట్లాడుకున్నారు. మంత్రయ్యాక గౌతం ఆనం ఇంటికి రావడం ఇదే మొదటిసారి. వారి వెంట తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాద్ కూడా ఉన్నాడు.



# నెల్లూరు కబుర్లు

## మొదలైన ఇంటర్ పరీక్షలు



ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈనెల 4వ తేదీ నుండి ప్రారంభమయ్యాయి జిల్లా వ్యాప్తంగా 50 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 37ప్రైవేట్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా నుండి 30వేల 958 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు.

## పాఠశాలలకు నిధులు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో 1201 పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణం, ప్రహరీ గోడలు, తాగునీటి వసతి కోసం 50కోట్ల రూపాయలు నిధులు మంజూరైనట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పనులు చేపట్టేందుకు పరిపాలన అనుమతులు జారీ చేస్తూ కలెక్టర్ శేషగిరిబాబు 4వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో పాఠశాలలో 7 నుంచి 13 లక్షల రూపాయల అంచనాలతో పనులు చేపట్టనున్నారు.

### వీఆర్ కళాశాల

## ప్రిన్సిపల్‌గా రవీంద్రరెడ్డి



వీఆర్ కళాశాల నూతన ప్రిన్సిపల్ గా రవీంద్రరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వీఆర్ విద్యాసంస్థల స్పెషలాఫీర్, జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ తనకు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు అప్పగించిన జేసీ వినోద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

**సర్వోదయకు కొత్త ప్రిన్సిపాల్**

సర్వోదయ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా పిచ్చయ్య నియమితులయ్యారు. ఈ మేరకు కళాశాలలో ఆయన ఈనెల 1న బాధ్యతలు స్వీకరించారు. కళాశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది ఆయన్ను అభినందించారు.

### వివిఎస్‌యులో

## విద్యార్థి జేఏసి ఆందోళన



కాకుటూరు వద్ద వున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో 2వతేదీ విద్యార్థి జేఏసి ఆధ్వర్యంలో వైస్ ఛాన్సలర్ ఆర్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ అందె ప్రసాద్‌లకు వ్యతిరేకంగా ఆందోళన జరిగింది. వీళ్లిద్దరూ యూనివర్శిటీ పరిధిలో అభివృద్ధిని అడ్డుకుంటూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని విద్యార్థి జేఏసీ నాయకుడు మదన్‌కుమార్‌రెడ్డి ఆరోపించాడు. వైస్‌ఛాన్సలర్ ఛాంబర్‌లో దాదాపు 3గంటల పాటు ఆందోళన నిర్వహించగా, పోలీసులొచ్చి సర్దుబాటు చేసి విద్యార్థులను అక్కడ నుంచి పంపారు.

## కలెక్టర్ కన్నెర్ర

నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ రాజుపై జిల్లా కలెక్టర్ కన్నెర్ర చేశారు. వైద్య కళాశాలలోని క్యాంటీన్‌లో ఆహారం నాణ్యంగా వుండడం లేదని సోమవారం స్పందన కార్యక్రమంలో కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణరాజును పిలిపించుకున్నారు. క్యాంటీన్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, క్రిమినల్ కేసులు బుక్ చేయిస్తానంటూ ఎడాపెడా వాయించిపెట్టారు.

## 15 నుండి ఒక్కపూట బడి

వేసవికాలం దృష్ట్యా ఈ నెల 15 నుండి ఒంటి పూట బదులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. 1నుండి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 7.45 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మాత్రమే పాఠశాలలు నిర్వహిస్తారు.

## టాక్సీలకు కరోనా దెబ్బ!

కరోనా వైరస్ దెబ్బకు టాక్సీ డ్రైవర్లు కూడా చెన్నై, తిరుపతి ఎయిర్‌పోర్టు డ్రాపింగ్ అంటే భయపడుతున్నారు. నెల్లూరు నుండి ప్రతిరోజూ పెద్దసంఖ్యలోనే ఈ రెండు ఎయిర్‌పోర్టులకు డ్రాపింగ్ లేదా పికప్‌లు వుంటాయి. విశాఖ, హైదరాబాద్‌ల నుండి నెల్లూరు వచ్చేవాళ్ళు ఎక్కువమంది తిరుపతి ఎయిర్‌పోర్టులో దిగి వస్తుంటారు. అలాగే దేశంలోని ఢిల్లీ, ముంబై వంటి నగరాలతో పాటు విదేశాలకు రాకపోకలు సాగించే నెల్లూరీయులు చెన్నై ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎయిర్‌పోర్టులకు పోవడానికి ఎక్కువమంది సొంత కార్లకంటే టాక్సీ వైపే మొగ్గుచూపుతుంటారు. కాని, ఇప్పుడు కరోనా వైరస్ దెబ్బకు భయపడి టాక్సీ డ్రైవర్లు ఎయిర్‌పోర్టులకు డ్రాపింగ్‌లు, పికప్‌లు మానేశారు.

## పాకులాడుతున్న అజీజ్



తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు నెల్లూరురూరల్ నియోజకవర్గంలో ప్రజాచైతన్య యాత్రను ఆ పార్టీ రూరల్ ఇన్‌ఛార్జ్, మాజీమేయర్ అబ్దుల్ అజీజ్ పట్టుదలగానే నిర్వహిస్తున్నాడు. జిల్లాలో మిగతా నియోజకవర్గాలలో దీని ఊసు లేనప్పటికీ, అజీజ్ మాత్రం పదిమందిని వెంటేసుకుని ప్రతిరోజూ ఎక్కడోచోట ప్రజాచైతన్య యాత్రలో తిరుగుతూనే వున్నాడు.

## అక్రమ కట్టడం కూల్చివేత

నెల్లూరు దర్గామిట్టలోని రామ్‌నగర్‌లో అనుమతులు లేకుండా కట్టిన మూడంతస్తుల భవనాన్ని నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది ఈనెల 4వ తేదీన కూల్చివేశారు. ఈ భవనం వల్ల భవిష్యత్తులో ప్రాణ నష్టం జరిగే అవకాశముందని, నిర్మాణం ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదముందని డిసిపి ప్రసాద్ తెలిపారు. అనుమతులు లేని అక్రమ నిర్మాణాలు ఎక్కడ చేపట్టినా కూల్చేస్తామని ఆయన హెచ్చరించారు.

## బిపిఎస్‌కు 30 వరకు గడువు

అక్రమ భవనాల క్రమబద్ధీకరణ(బిపిఎస్) స్కీంను రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 30వతేదీ వరకు పొడిగించింది. నిబంధనలకు విరుద్ధంగా భవనాలు కట్టిన వాళ్ళు ఈ స్కీం క్రింద క్రమబద్దీకరించుకోవడానికి ఇదొక అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి ఒక ప్రకటనలో కోరారు.

## అనిల్‌ను సత్కరించిన ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్



ది నెల్లూరు ఆర్యవైశ్య బులియన్ మర్చెంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ వాళ్ళు గత నెల 29న నెల్లూరు, రంగనాయకులపేటలోని తమ అసోసియేషన్ కార్యాలయంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఎం.ద్వారకానాథ్, అసోసియేషన్ నాయకులు అమరా మోహన్‌రావు, ఎం.పి.ఆంజనేయులు, సిహెచ్ శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపిలో చేరిన కిన్నెర



తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీకార్పొరేటర్ కిన్నెర ప్రసాద్, తన అనుచరులతో కలిసి గత నెల 29వ తేదీన మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో వైసిపిలో చేరాడు. వైసిపిలో చేరుతున్న సందర్భంగా కిన్నెర తన మందీమార్బలంతో బాగానే హంగామా సృష్టించాడు. ఇటీవలే కిన్నెర ప్రసాద్ సోదరుడు కూడా వైసిపిలో చేరడం తెలిసిందే! వైటి నాయుడుకు ముఖ్య అనుచరుడైన కిన్నెరకు లక్ష్మీపురం ఏరియాలో గట్టి పట్టుంది. నిన్నటి అసెంబ్లీ ఎన్నికల లోనే ఆయన వైసిపిలోకి రావాలని ప్రయత్నించారు, కొన్ని అవాంతరాల వల్ల తెలుగుదేశంలోనే వుండిపోయాడు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కిన్నెర డివిజన్ లోనే తెలుగుదేశంకు మంచి మెజార్టీ వచ్చింది. వైసిపి ఇప్పటి వరకూ బలహీనంగా వున్నది కిన్నెర డివిజన్ లోనే! ఇప్పుడు అది తారుమారు కావచ్చు.

## నేతన్న నేస్తంకు 3వేల దరఖాస్తులు

'వైయస్సార్ నేతన్న నేస్తం' పథకానికి జిల్లాలో ఐదు వేల మంది దరఖాస్తులు చేసుకున్నట్లు జిల్లా జౌళి, చేనేత సహాయ సంచాలకులు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు సొంత మగ్గం వున్నవాళ్ళు మాత్రమే ఈ పథకానికి అర్హులని, గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్ల ద్వారా దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని, ఈనెల 20 నాటికి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని పేర్కొన్నాడు.

## విశాలాక్షికి 50వేల విరాళం

వెంకటాచలం మండలం గొలగమూడి వద్ద గల విశాలాక్షి వృద్ధాశ్రమానికి ప్రముఖ బ్యూటీషియన్ లలితారెడ్డి 50వేల విరాళం అందజేశారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు కోసూరు రత్నం చేతికి ఆమె ఈ విరాళం అందించడం జరిగింది.

## కస్తూరిదేవి స్కూల్‌లో సైన్స్‌డే

నెల్లూరు కస్తూరిదేవి హైస్కూల్‌లో గత నెల 29వ తేదీ సైన్స్‌డేను నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలతో సైన్స్ ప్రదర్శన ఏర్పాటు చేయగా స్కూల్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో సైన్స్ ప్రాధాన్యత ఎంతో వుందని, చిన్నప్పటి నుండే విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మిస్ట్రెస్ వనజ, ఏ.ఓ నరేష్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మంచి బ్రాండ్లు లేపేసి...

## స్పిరిట్ అమ్ముతున్నారు

**- ఆనం వెంకటరమణ**

రాష్ట్రంలో మద్యం పాలసీ లోపభూయిష్టంగా వుందని, వైన్‌షాపుల్లో మంచి బ్రాండ్ల మద్యాన్ని తీసేసి స్పిరిట్ అమ్ముతున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి మండిపడ్డాడు. ఇటీవల నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో రెండుసార్లుగా విలేకరుల సమావేశం పెట్టిన ఆయన ప్రజల ప్రాణాలు తీసే చెత్త మద్యాన్ని అమ్మే బదులు పూర్తిగా మద్యపాన నిషేధం విధించాలని డిమాండ్ చేశాడు. బ్రాండెడ్ మద్యం విక్రయాలను ఆపేసి, ఊరూపేరు లేని చీప్ లిక్కర్‌ను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించాడు.

అలాగే 2వ తేదీ నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిపై విరుచుకుపడ్డాడు. తన చిన్నాన్న వైయస్ వివేకానందరెడ్డి హత్యపై చంద్రబాబు హయాంలో సిబిఐ దర్యాప్తు కోరిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు సిబిఐ దర్యాప్తు చేయడానికి ఎందుకు వెనుకడుగు వేస్తున్నాడని ప్రశ్నించాడు. వైయస్ రాజశేఖరరెడ్డి దుర్మరణం విషయంలో ఏ ముఖేష్ అంబాని హస్తముందని వైయస్ జగన్మోహన్‌రెడ్డి అనుమానించాడో, అదే అంబానీకి కుటుంబ సమేతంగా స్వాగతం పలకడం శోచనీయమన్నాడు. వైయస్ వివేకానందరెడ్డి హత్యపై ఆయన కుటుంబసభ్యులే సిబిఐ దర్యాప్తుకు కోర్టును ఆశ్రయించే దుస్థితి వచ్చిందని, వైయస్ రాజశేఖరరెడ్డి, వైయస్ వివేకానందరెడ్డి అభిమానులకు దీనిపై జగన్మోహన్‌రెడ్డే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశాడు.

## ఏఎన్ఎంల కార్యవర్గం

ఏఎన్ఎం, హెచ్‌వి, పిహెచ్‌ఎన్, సిహెచ్‌ఓల జిల్లా అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఇటీవల నెల్లూరులోని ఎన్జీఓ హోంలో జరిగిన కార్యక్రమంలో ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కరుణ, కార్యదర్శిగా చిన్నమ్మ, అసోసియేట్ అధ్యక్షురాలిగా శోభ, ఉపాధ్యక్షురాళ్లుగా ఝాన్సీరాణి, రమణమ్మ, సంపూర్ణ, రియానా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సంయుక్త కార్యదర్శులుగా ఆదిలక్ష్మి, ప్రసన్న, శిరీషా, సంయుక్త కార్యదర్శులుగా శ్యామల, లూసీ, విజయలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## బిఎస్ 4కు ఈ నెలే గడువు

భారత్ స్టేజ్(బిఎస్4) వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఈనెల 31వతేదీ దాకా గడువిచ్చారు. బిఎస్4 వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఈనెల 31వతేదీ దాకా గడువిచ్చారు. ఈ వాహనాల రిజిస్ట్రేషన్‌కు ఫిబ్రవరి 29 వరకే గడువు ఇచ్చినప్పటికీ, సాంకేతిక కారణాలతో మరో నెల పొడిగించారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి బిఎస్ 6 వాహనాలు మాత్రమే రిజిస్టర్ చేయనున్నారు.

### అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా

## 'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు'

# పుస్తకావిష్కరణ 8న

- ఉపరాష్ట్రపతి సతీమణి ఉషమ్మకు గౌరవ సత్కారం



ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లాయర్ వారపత్రిక ఆధ్వర్యంలో ఈనెల 8వ తేది ఆదివారం ఉదయం 10 గంటలకు "సింహపురికి వన్నె తెచ్చిన వనితలు" కాఫీ టేబుల్ బుక్ ఆవిష్కరణ జరుగుతుంది. ఈ ఏడాది జూన్ 5 తేదీన 'లాయర్' వారపత్రిక 40వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన నెల్లూరు ఆడపడుచులకు అక్షర నీరాజనం పలుకుతూ ఈ పుస్తకం రూపొందింది. ప్రధానంగా నెల్లూరు ఖ్యాతిని దశదిశల వ్యాపింపజేసిన సింహపురి మహిళల విశిష్ట సేవలను గుర్తిస్తూ వారి సేవలను వేనోళ్ళ కొనియాడుతూ నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలన్న సంకల్పంతో 'సింహపురికి వన్నె తెచ్చిన వనితలు' పుస్తకాన్ని ప్రచురించడానికి 'లాయర్' సంకల్పించింది.

ఈ సందర్భంగా భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి సతీమణి శ్రీమతి ముప్పవరపు ఉషమ్మ గౌరవ సత్కారాన్ని స్వీకరించనున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకురాలు గునుపాటి పింకిరెడ్డి అధ్యక్షత వహించే ఈ కార్యక్రమాన్ని తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభిస్తారు. ముఖ్యఅతిథులుగా సవేరా గ్రూఫ్ ఆఫ్ హోటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లారెడ్డి నీనరెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపావెంకట్, ప్రముఖ గాయనీమణి ఎస్పీ శైలజ, నార్ ఇన్‌ఫ్రా ప్రై.లి. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నూకలపాటి పార్వతీరెడ్డిలు పాల్గొంటారు.

ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుఇంగోయిమలై తిరుచ్చి జిల్లా ముసిరి తాలూకా శ్రీ లలితా మహిళా సమాజం, శ్రీ విద్యోపాసకులు యోగినులు, శ్రీ విద్యాంబ సరస్వతీ మాతాజీ మరియు ఆమె శిష్య బృందం పాల్గొంటారు.

వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు నేటి యువతకు స్ఫూర్తిదాయకంగా ఉండాలన్న సంకల్పంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన "సింహపురికి వన్నెతెచ్చిన వనితలు" పుస్తకాన్ని లాయర్ వారపత్రిక ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్న సందర్భంగా జిల్లాలోని ప్రజలు, నేటి తరం యువ మహిళామణులు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రగతిపథం వైపు సాగాలని కార్యక్రమానికి సారథ్యం వహిస్తున్న తుంగా భారతిరెడ్డి, తుంగా సిందూరరెడ్డిలు పిలుపునిచ్చారు.

# అభివృద్ధికి దారులు వేద్దాం

### - మంత్రులు అనిల్, గౌతమ్

జిల్లాలో అభివృద్ధి పనులకు ఇసుక కొరత ఉండడంపై మంత్రులు అనిల్ కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి మంత్రులిద్దరూ గత నెల 29న నెల్లూరు జడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1500 కోట్లకుపైగా వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వీటికి ఇసుక కొరత రాకుండా చూడాలని మంత్రులు కోరారు. జిల్లా అవసరాలకు, స్థానిక అవసరాలకే ముందు ప్రాధాన్యత నివ్వాలన్నారు. అడ్డమైన నిబంధనల



పేరుతో ఇసుక వాహనాలను సీజ్ చేస్తే పనులు ఆగిపోతాయన్నారు. ఇతర జిల్లాలకు ఏ విధంగా ఇసుకను తరలిస్తారని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా అధిక రేట్లకు ఇసుక ఎందుకు అమ్ముతున్నారంటూ మంత్రులు ప్రశ్నించారు. సిఎస్ఆర్ నిధులను తాగునీటి అవసరాలకు వాడాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వి.వరప్రసాద్, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జిఎస్ఎల్‌వి-ఎఫ్10

## ప్రయోగం వాయిదా



ఈనెల 5వ తేదీ సాయంత్రం 5.43 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుండి ప్రయోగించాల్సిన జిఎస్ఎల్‌వి-ఎఫ్10 రాకెట్ ప్రయోగం వాయిదా పడింది. సాంకేతిక కారణాలతో ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు ఇస్రో ఛైర్మన్ శివం వెల్లడించారు. ఈ ప్రయోగం కోసం ఇస్రో ఛైర్మన్ సాంప్రదాయబద్ధంగా ముందురోజే తిరుమలలో శ్రీవారి పాదాల వద్ద రాకెట్ నమూనా ఉంచి పూజలు నిర్వహించారు. అలాగే సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి దేవస్థానంలో ఛైర్మన్ పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

5తేదీ 4.43 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావాల్సి ఉండేది, కానీ రాకెట్‌లో సాంకేతిక లోపాల్ని గమనించడంతో ప్రయోగాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు





### ఇద్దరు ముగ్గురు తప్పితే....

# అందరూ దోపిడీదారులే!

నెల్లూరు జిల్లాలో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు తప్పితే మిగతా ఎమ్మెల్యేలు అందరూ ప్రజా సొమ్ము దోచుకోవడంలో పోటీలు పడుతున్నారని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు ఈనెల 4వ తేదీన నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సర్వేపల్లి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల దోపిడీకి పంచభూతాలు పరమావధిగా మారాయన్నారు, వెంకటాచలం మండలంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నా అధికార యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తుందని ఆరోపించారు. తహశీల్దార్లు, సి.ఐలు అధికార పార్టీ ఎమ్మెల్యేలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, వైసీపీ ఎమ్మెల్యేల నిరంకుశ చర్యలు చూసి కలెక్టర్, ఎస్పీలే తలలు పట్టుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం పాలసీ లోపభూయిష్టంగా మారిందని దశలవారీ మద్యనిషేధం పేరుతో చౌకబారు మద్యాన్ని ప్రజలకు విక్రయిస్తూ వారి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని విమర్శించారు. 2014 ఎన్నికలలో వైసిపి ఎమ్మెల్యేలు ఏ నకిలీ మద్యం అయితే ప్రజల చేత తాగించి వారి చావుకు కారణమయ్యారో.. అవే బ్రాండ్లను ఇప్పుడు మద్యం దుకాణాల్లో అమ్ముతున్నారని అన్నారు. హౌస్ ఫర్ ఆల్ కింద వేలాది ఇళ్లను గత తెలుగుదేశం ప్రభుత్వం పూర్తి చేసిందని అవి లబ్ధిదారులకు చెందకుండా వైసీపీ ప్రభుత్వం ఆ కాలనీలను స్మశానాలుగా మారుస్తున్నారని ఆరోపించారు. టిడిపి నాయకుల భూములను రాజకీయ కక్షతో స్వాధీనం చేసుకుంటూ వాటిని పట్టాలుగా పంపిణీ చేస్తామంటున్నారు, పేదల కడుపు కొట్టి మీ పార్టీ కార్యకర్తలకు ఇవ్వడం న్యాయమేనా అని ఆయన ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్పందన కార్యక్రమం కేవలం అధికార పార్టీ నాయకుల కోసం స్పందించడానికి మాత్రమే ఏర్పాటు చేసింది అన్నట్లుగా ఉందన్నారు. బీసీలపై లేని ప్రేమను చూపిస్తూ బీసీ రిజర్వేషన్ల ముసుగులో ఈ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదాలు వేయడానికి ఎన్నో కుట్రలు పన్నుతుందని ఆయన ఆరోపించారు



- సోమిరెడ్డి


శ్రీరస్తు! శ్రీ రంగనాథ పరబ్రహ్మణే నమః శ్రీమతే రామానుజాయ నమః శుభమస్తు!!
శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానము
రంగనాయకులపేట, నెల్లూరు. ఫోన్ : 0861 - 2331156.
బ్రహ్మోత్సవ ఆహ్వానము తేది. 04-03-2020 నుండి తేది. 14-03-2020 వరకు





08-03-2020 ఆదివారం రాత్రి 9 గంటలకు హనుమంతసేవ
09-03-2020 సోమవారం రాత్రి 9.30 గంటలకు బంగారు గరుడసేవ
10-03-2020 మంగళవారం సాయంత్రం 6 గంటలకు కళ్యాణోత్సవం
11-03-2020 బుధవారం ఉదయం 8.30 గంటలకు రథోత్సవం
15-03-2020 ఆదివారం రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం






తేది 11.03.2020 బుధవారం రథోత్సవం సందర్భముగా
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల శాఖా మాత్యులు
గౌ॥ డా॥ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ గారిచే
శ్రీ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పణ
శ్రీ కోట గురుబ్రహ్మం ఛైర్మన్ | భవదీయులు | డబ్బుగుంట వెంకటేశ్వర్లు కార్యనిర్వహణాధికారి
ధర్మకర్తల మండలి: శ్రీ కనసాని ఆదినారాయణ, శ్రీ దువ్వూరు నరేంద్ర, శ్రీ శ్రీకంఠం రమణయ్య, శ్రీ పొంగూరు వెంకటసుబ్బారెడ్డి, శ్రీ పసుపులేటి మల్లికార్జునరావు, శ్రీమతి మానికల సుష్మదీప్తి, శ్రీ పిగిలం సుధీర్‌కుమార్, శ్రీ చుండూరు జగన్మోహన్, శ్రీ కిడాంబి జగన్నాథాచార్యులు, ఎక్స్‌అఫిషియో మెంబర్

# కళ్యాణ వైభవం...!

## హర్షిణి - యశ్వంత్



ఏపిఎస్‌పిడిసిఎల్ నెల్లూరు ఏ.ఇ మోపూరు చంద్రశేఖరం - చెంచులక్ష్మిల కూతురు **హర్షిణి - యశ్వంత్‌కుమార్** (చిత్తూరు జిల్లా, పుత్తూరు వాస్తవ్యులు ఉంగరాల శంకరయ్య - మంజులల కుమారుడు)ల పరిణయం ఫిబ్రవరి 25వ తేదీ నెల్లూరులోని ఏఎన్ఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' అభినందనలు.

## సునీల్ - అనుపమ




నెల్లూరు నగరానికి చెందిన సిపిఐ(ఎం) నాయకులు ఆర్.శ్రీనివాసులు(కాయంబు శీనయ్య) - ధనలక్ష్మిల కుమారుడు **డా॥ సునీల్ - అనుపమ** (తిరుపతి వాస్తవ్యులు సి.చంద్రశేఖర్ - గీతల కుమార్తె)ల కల్యాణం ఫిబ్రవరి 28వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## రాజేష్ - లక్ష్మీ వినతి



వింజమూరు వాస్తవ్యులు పోరెడ్డి బాలసుబ్బారెడ్డి - సుశీలమ్మల కుమారుడు **రాజేష్ - లక్ష్మీ వినతి** (గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి - వెంకటరమణమ్మల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 26వ తేదీ వింజమూరులోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

## పూజిత - సుజిత్



నెల్లూరు ఫత్తేఖాన్‌పేట వాస్తవ్యులు గాదం శ్రీనివాసులు(వాసు) - కృష్ణవేణిల కుమార్తె **పూజిత వాసు - సుజిత్ వరుణ్** (స్వర్గీయ బస్సెట్టి సురేంద్రభాస్కర్ - నిర్మల ల కుమారుడు)ల పెళ్ళి ఫిబ్రవరి 27వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శభాశీస్సులు.

# గూడూరు డివిజన్ వార్తలు

## దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, పక్కన డాక్టర్ రోహిణి, జనార్దన్‌రెడ్డి తదితరులు

విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని చదువుల్లో బాగా రాణించాలని సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ఈ నెల 1న గూడూరులోని డాక్టర్ సిఆర్‌రెడ్డి 92వ పుట్టినరోజు సందర్భంగా లయోలా జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న ప్రేమ్‌కుమార్ అనే విద్యార్థికి డాక్టర్ సిఆర్‌రెడ్డి కుటుంబసభ్యుల దాతృత్వంతో ఇన్నర్‌వీల్, ఆంధ్రమహిళా మండలి ఆధ్వర్యంలో 7,500 రూపాయలు ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. సిఆర్ డిజిటల్ నెట్‌వర్క్ కేబుల్ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్, ఆంధ్రమహిళా మండలి ఆధ్వర్యంలో మోక్షధామానికి శవపేటికను అందజేశారు. అనంతరం నిర్వాహకులు గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, మెహర్మణి, శశికళ, ప్రభారెడ్డి, పివి కృష్ణయ్య, ఎం.జీవని, దేగా సుప్రియ, సమత, శ్రీనివాస్ సాథే తదితరులు పాల్గొన్నారు.

## 17 నుంచి ముత్యాలమ్మ జాతర



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, సబ్‌కలెక్టర్, డిఎస్పీ

జిల్లాలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతర ఈనెల 17 నుంచి ప్రారంభం కానుంది. జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకండా ఆలయ నిర్వాహకులు, అధికారులు సంయుక్తంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర ఏర్పాట్లకు సంబంధించి ఈనెల 3న వివిధ శాఖల అధికారులతో సమావేశమైన సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ వివరంగా చర్చించారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు, డిఎస్పీ శ్రీభవాని హర్ష తదితరులతో జాతర ఏర్పాట్ల గురించి మాట్లాడారు. ఈనెల 20వ తేదీ దాకా జరిగే ఈ జాతరలో భక్తులకు అమ్మవారి దర్శనం, క్యూలైన్ల ఏర్పాటు, ఇతరత్రా మౌలిక సదుపాయాలకు లోటు లేకుండా చూడాలని వారు అధికారులను ఆదేశించారు.

## ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



రియాజ్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ఎంపి బల్లి దుర్గాప్రసాదరావు

ప్రభుత్వ ఉద్యోగులు సమర్ధవంతంగా విధులు నిర్వహించడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని తిరుపతి ఎంపీ బల్లి దుర్గాప్రసాదరావు అన్నారు. ఈనెల 1న గూడూరులోని ముత్తుమూరి కల్యాణమండపంలో పంచాయతిరాజ్‌శాఖలో ఏఇగా పనిచేస్తూ పదవీవిరమణ పొందిన షేక్ రియాజ్ అహ్మద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రియాజ్ అహ్మద్ పిఆర్ శాఖలో ఏఇగా అంకితభావంతో పనిచేస్తూ, పిఆర్ డిప్లొమా ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, రాష్ట్ర జేఏసి వైస్‌ఛైర్మెన్‌గా కూడా ఆయన ఉద్యోగుల కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఎనలేని కృషి చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, మాజీ మునిసిపల్ ఛైర్మెన్ పొణకా దేవసేన మాట్లాడుతూ రియాజ్ అహ్మద్ లయన్స్‌క్లబ్ ప్రతినిధిగా, మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షునిగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి రాష్ట్ర ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జోసఫ్, సుధీర్‌బాబు, బండి శ్రీనివాసరావు, బల్లి కల్యాణచక్రవర్తి, పొణకా శివకుమార్‌రెడ్డి, డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డితో పాటు రియాజ్ కుటుంబసభ్యులు జమీలా బేగం, తజీన్, తహశీన్, ఫరహాన్, అనీఫ్, సౌజిద్‌బాషా, హబీబ్ హుస్సేన్ పాల్గొన్నారు.

## అరవ పార్వతయ్యకు గౌరవ డాక్టరేట్



ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా, లోక్ అదాలత్ సభ్యులుగా అరవ పార్వతయ్య అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఫిబ్రవరి 29న నేషనల్ వర్చువల్ యూనివర్శిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ –మైసూరు వారిచే తాను గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్లు ఆయన తెలిపారు.

# అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

## • భారీగా ఆస్తి నష్టం

నెల్లూరు దర్గామిట్ట కరెంటాఫీస్ సెంటర్ లోని రిత్విక్ ఎన్‌క్లేవ్‌లో శ్రీ సాయి నివాస్ అయిదంతస్తుల అపార్ట్‌మెంట్ వుంది. ఈనెల1న సాయంత్రం ఉన్నట్లుండి ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగి పేలి పోయింది. దీంతో మూడవ అంతస్తులో మూడేళ్ళుగా నివాసముంటున్న విజయలక్ష్మీ ప్లాట్(201)లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు రేగాయి. ఇంట్లోనే ఉన్న విజయలక్ష్మి భయంతో ప్లాట్ నుంచి కిందికి పరుగులు తీసింది. ఆమె ఇంటి నిండా ర్యాకుల్లో చీరలు అమర్చివుండడంతో వాటికి మంటలు అంటుకుని అగ్ని ప్రమాద తీవ్రత పెరిగింది. బాత్‌రూంలో వున్న గ్యాస్ సిలిండర్, వంట గదిలో ఉన్న సిలిం డర్లు పేలడంతో ఏం జరిగిందోనని అపార్ట్‌మెంట్‌లోని మిగిలిన ప్లాట్ల వారు కిందకు పరుగులు తీశారు. గ్యాస్ సిలిండర్ల పేలుడు ధాటికి విజయలక్ష్మి ప్లాటు పూర్తిగా దెబ్బతింది. వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. సమీపంలోని 202 ప్లాట్, పైభాగంలో ఉన్న మరో రెండు ప్లాట్లు మంటల ధాటికి పాక్షికంగా దెబ్బ తిన్నాయి. ఈ భారీ అగ్ని ప్రమాదంలో రూ. 1.50 కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా.

విజయలక్ష్మి ఫ్లాట్‌లోని వస్తువులన్నీ అగ్నికి పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో వారు కట్టుబట్టలతో మిగిలారు. రూ.40 వేల నగదు, 8 కేజీల వెండి వస్తువులు, 40 సవర్ల బంగారు ఆభరణాలు, లక్షలు విలువ చేసే చీరలు అగ్నికి ఆహుతయ్యా యని బాధితురాలు విజయలక్ష్మి కన్నీరు మున్నీరయ్యారు.

**విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమే..**

ఈ ప్రమాదానికి విద్యుత్ శాఖ అధికా రుల నిర్లక్ష్యమే కారణమని బాధితులు, స్థానికులు, అపార్ట్‌మెంట్‌లోని నివాసులు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా అపార్ట్‌మెంటుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్ అధికలోడ్ కారణంగా పలుమార్లు విద్యుత్తుకు అంతరాయం కలగడంతో పాటు మూడుసార్లుకు పైగా ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగాయని ఫిర్యాదు చేసినప్పటికి ఆ శాఖ అధికారులు నిర్ల క్ష్యంగా వ్యవహరించారని బాధితులు వాపోయారు. సకాలంలో స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదంటున్నారు. అగ్ని ప్రమా దంలో ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

**అగ్నిమాపక శాఖ సహాయక చర్యలు**

అగ్ని ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి నేతృత్వంలో 20 మంది సిబ్బంది రెండు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు నిర్విరా మంగా కష్టపడి రాత్రి 10గంటలకు అతి కష్టంపై కొంతమేర మంటలను అదుపు లోకి తీసుకొచ్చారు. దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ ప్రాంతమంతా గందర గోళ పరిస్థితి నెలకొంది. ఘటనా స్థలం వద్దకు నగర డిఎస్పీ జె. శ్రీనివాసులురెడ్డి, దర్గామిట్ట, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్లు మిద్దె నాగేశ్వరమ్మ, టీవీ సుబ్బారావు, ఎస్సైలు నాగభూషణం, పుల్లారెడ్డి, వేణు సిబ్బంది పాల్గొన్నారు.



# నేత్రపర్వం.. మల్లిఖార్జునస్వామి కల్యాణం

నెల్లూరు వీఆర్ కళాశాల సెంటర్ నుంచి గొలగమూడి రోడ్డులోని వీపీఆర్ కన్వెన్షన్ హాల్ వరకు ఆంధ్రప్రదేశ్ వీరశైవ జంగము కుల జేఏసీ ఛైర్మన్, వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ టి.వసంతలక్ష్మి రవికుమార్ ఆధ్వర్యంలో శ్రీశైల జగద్గురు శ్రీశ్రీ 1008 డాక్టర్ చెన్న సిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామీజీ, కర్ణాటక కోడి మఠాధిపతులు డాక్టర్ రాజేంద్రశివాచార్య స్వామిజీ, బార్చి-కాశి శాఖ మఠంకు చెందిన శ్రీషాత్ర 108 గురు సిద్ధ మణికంఠ శివాచార్యులు మఠశాఖ, శ్రీశ్రీ విజయదుర్గ పీఠాధిపతి శివశ్రీపతి వీరబ్రహ్మయ్య శివాచార్య స్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీశైల భ్రమ రాంబ సమేత శ్రీ మల్లిఖార్జునస్వామి వార్ల కళ్యాణం సందర్భంగా నిర్వహించిన రథయాత్ర ఈనెల1న కమనీయంగా జరిగింది. ఈ రథయాత్రను వసంతలక్ష్మి ప్రారంభించారు. వీఆర్సీ సెంటర్ నుండి వీపీఆర్ కన్వెన్షన్ హాల్ వరకు భక్తులు బైక్ ర్యాలీ నిర్వ హించారు. అనంతరం వీపీఆర్ కన్వెన్షన్ హాల్లో జగద్గురువులు ఉపన్యసిస్తూ భక్తులు ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగా లన్నారు. భక్తి మార్గంతో ముక్తి చేకూరు తుందని అన్నారు. తొలుత కాకుటూరులో వున్న వసంతలక్ష్మికి చెందిన స్థలంలో జగ ద్గురువులచే వీరశైవ ధర్మపీఠాన్ని ప్రారం భించారు.

గంధవళ్ళ దశరధరామయ్య, కల్పం రమేష్, తెనాలి శ్రీనివాసులు, చేజర్ల సుధా కర్‌రావు, పంచాక్షరి మల్లయ్య, ముత్యాల పిచ్చయ్య, దండు సుబ్బారావు, పుల్లూరు ప్రసాద్, కల్పం కృష్ణ, యాగంటి సునీల్, వీరశైవ జంగము కులస్తులు పాల్గొన్నారు.

# ఎన్నార్సీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ చట్టం సీఏఏ, ఎన్పీఆర్, ఎన్నార్సీ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ చట్టాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో ప్రజలు భాగ స్వాములు కావాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పిలుపునిచ్చారు. ఈనెల 1న నెల్లూరులోని రామకోటయ్య భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఢిల్లీ అల్లర్లతో తగలబడుతుంటే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. అసోంలో 19 లక్షల మంది పౌరసత్వ జాబితాలో చోటు కోల్పోయారని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కేవలం వ్యాపారాన్ని వృద్ధి చేసుకునేందుకే వచ్చారని, ఆయన పర్యటనతో దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. అమెరికా ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే దేశ పరిశ్రమలు దివాలా తీస్తాయని, ఎంతోమంది ఉపాధి కోల్పోతారని తెలిపారు. అమెరికాలోని భారత పౌరులను హెచ్1 బీ వీసాల పేరుతో తీవ్ర ఇబ్బంది పెడుతున్నా రని అన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో అక్రమాలు చోటు చేసుకుని ఉంటే చంద్రబాబుతో సహా అందర్నీ శిక్షించాలన్నారు. కర్నూలు హైకోర్టును స్వాగతిస్తున్నా మన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, దామా అంకయ్య, రామరాజు పాల్గొన్నారు.

శ్రీను గల్పిక

# వైజాగ్‌లో బాబుకు నీరాజనం

హైదరాబాద్‌లోని హైటెక్‌రత్న చంద్ర బాబునాయుడు నివాసం. చంద్రబాబు టిఫిన్ తిని బాబు భరోసా యాత్రలో భాగంగా విశాఖపట్నంకు పోవడానికి బయలుదేరబోయాడు. అప్పుడే దేవాన్ష్ పరుగెత్తుకుంటూ వచ్చి.. తాతయ్య, వైజాగ్ నుంచి వచ్చేటప్పుడు నాకేం తెస్తావ్ అని ముద్దుగా అడిగాడు. చంద్రబాబు అందుకు... ఈ పేదతాతయ్య నీకు ఏమి తేగలడమ్మా, వాచి, ఉంగరం కూడా లేని నిరుపేదను నేను, రాజకీయాల్లోకొచ్చి మా నాయన ఇచ్చిన రెండెకరాల పొలం కూడా అమ్ముకున్నాను, నాకంటే నువ్వే మేలు, కనీసం 57కోట్ల ఆస్థన్నా వుంది. నాకు అది కూడా లేదు. నేనేమీ తేగలను అంటూ వాపోయాడు. దానికి దేవాన్ష్... అదేంటి తాతయ్య, నువ్వు జోలె పడితే బోలెడు డబ్బులు వస్తున్నాయి కదా, ఆ డబ్బులతోనే నాకు క్యాడ్‌బరీ చాక్లెట్లుతే అని అన్నాడు. నీ చాక్లెట్ల కోసం నన్ను అడుక్కోమంటావా... భలే ఐడియా ఇచ్చావు అంటూ చంద్రబాబు మనుమడి మాటలకు మురిసి పోయాడు. అంతలో భువనేశ్వరి లేచి వచ్చి ఒక సంచి చంద్రబాబు చేతిలో పెట్టింది. ఏంటిది అని చంద్రబాబు అడి గాడు. వైజాగ్ వెళ్తున్నారు కదా, మీ దగ్గరే వుంచుకోండి పనికొస్తుందని చెప్పింది. ఆమె చెప్పింది ఎందుకో అర్థంకాక పోయినా చంద్రబాబు ఆ సంచిని మడిచి ఫ్యాంటు జేబులో పెట్టుకుని బయటకొచ్చి కారెక్కాడు. నేరుగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నాడు. విశాఖపట్నం వెళ్లే ఎయిర్ ఇండియా విమానమెక్కాడు. విమానం రన్‌వే మీద నుండి ముందుకు కదిలింది. రయ్‌మని ఎగిరింది... చంద్ర బాబు... విశాఖపట్నంలో అశేష జన వాహిని మధ్య తనకు లభించే స్వాగత సత్కారాన్ని వూహించుకుంటూ అలా కళ్ళు మూసుకున్నాడు.

* * * * *

అది విశాఖ విమానాశ్రయం... హైదరాబాద్ నుండి వచ్చిన ఎయిర్ ఇండియా విమానం అప్పుడే దిగింది. అందులో నుండి చంద్రబాబు దిగి లాంజ్‌లోకి వచ్చాడు. అక్కడ చూస్తే నేల ఈనిందా... నింగి వగిలిందా అన్న ఎన్టీఆర్ డైలాగ్ లెవల్లో ఇసుకేస్తే రాల నంతగా జనం... అందరి చేతుల్లో తెలుగుదేశం జెండాలు... అందరు కూడా "కావాలి జాబు... రావాలి చంద్రబాబు" అని పాటపాడుతున్నారు. చంద్రబాబు అలా బయటకు రాగానే పెద్దఎత్తున వచ్చిన మహిళలు ఆయనకు మంగళ హారతులిచ్చి, దిష్టితీసి గుమ్మడికాయలు కొట్టి, 'జయము జయము చంద్రన్న జయము నీకు చంద్రన్న' అనే భజన పాట పాడారు. తర్వాత ఆయన నడుస్తుంటే ఆయన నడిచే దారిలో పూలు చల్లుతూ తీసుకుపోసాగారు. అలా విశాఖరోడ్డుపై వెళ్తుండగా ఓ వృద్ధుడు వచ్చి... అయ్యా, ఆ జగన్ విశాఖపట్నంను రాజధానిగా పెడతానంటున్నాడు, ఇక్కడ రాజధాని పెడితే మా భూములన్నీ కబ్జా చేస్తారు, మాకు అమరావతే రాజధాని కావాలి, దాని కోసం పోరాడండయ్యా, మీ వెనుక మేముంటాము అని చెప్పాడు. రాజధాని ఇక్కడ పెడితే మీ భూములు పోతాయ్, అక్కడ పెట్టకుంటే మా భూముల రేట్లు దెబ్బతింటాయ్... నేను తిరిగేదే ఇందు కోసం కదా అని చంద్రబాబు మనసులో అనుకుని... మీలాంటి వారి కోసమే కదా పెద్దయ్య నేను తపన పడేది అని పైకి అన్నాడు. కొద్దిదూరం పోగానే ఓ వ్యక్తి తూలుతూ చంద్రబాబు వద్దకు వచ్చాడు... వచ్చీ రావడంతోనే పెద్దగా ఏడుస్తూ... అయ్యా, అన్యాయం జరిగిపోయిందయ్యా, మిమ్మల్ని ఓడించిన దానికి మాకు తగిన శాస్తే జరిగిందయ్యా.. అంటూ వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. ఏమైంది అని చంద్రబాబు అతనిని ఆతృతగా అడిగాడు. దాని కతను.. కింగ్ ఫిషర్, రాయల్‌స్టాగ్, సిగ్నేచర్, బ్లెండర్ ప్రైడ్, టీచర్ ఛాయిస్, ఓల్డ్‌మాంక్, మాన్షన్ హౌస్, హాబ్‌సన్స్, బ్లాక్‌డాగ్... అని చెప్పుకుపోతుండగా, చంద్రబాబు కలుగజేసుకుని, వీళ్లంతా ఏ దేశపు క్రికెట్ ప్లేయర్స్ అని ప్రశ్నించాడు. దానికి ఆ తాగుబోతు పాపారావు... అయ్యో దేవుడా... మద్యం అమ్మకాలకు బ్రాండ్ అంబాసిడర్‌లాంటి మీకే ఈ బ్రాండ్‌లు తెలియకపోవడం ఏందయ్యా.. ఇవి క్రికెట్ ప్లేయర్ల పేర్లు కావు, మద్యం బ్రాండ్లు... వీటి పేర్లు నీకు తెలియక పోవడమేంటి అని అన్నాడు. నాకెలా తెలుస్తుంది, నేనెప్పుడన్నా తాగానా ఏంటి, ఒక్క మందే కాదు, సిగరెట్, బీడీ, కిళ్లీ, గుట్కా, ఖైనీ వంటి అలవాట్లు కూడా నాకు లేవు అని చంద్రబాబు చెప్పాడు. అప్పుడు తాగుబోతు పాపారావు కోపంగా... అందుకేనా ఇంతకూల్‌గా వున్నావ్, నీకు తాగుడు అలవాటుంటే సాటి తాగుబోతుల బాధేంటో తెలిసేది, ఇప్పుడు నేను చెప్పిన బ్రాండ్లేవి మద్యం షాపుల్లో దొరకడం లేదు, మీరున్నప్పుడైతే ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ దొరికేది, ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎక్కడ కావాలంటే అక్కడ మందు దొరికేది. ఇప్పుడు మద్యం షాపులను ప్రభుత్వమే నడుపుతోంది, ఎమ్మార్వో ఆఫీసులకంటే లేటుగా తీస్తున్నారు, ఎంపి డిఓ ఆఫీసుల్లో స్టాఫ్ కంటే ముందే పోతు న్నారు. మందు దొరకడం చాలా కష్టంగా వుందయ్యా... ఆ జగన్మోహన్‌రెడ్డిని సీఎంను చేసినందుకు మా చెప్పుతో మేం కొట్టుకోవాలి అంటూ తన ఎడమకాలి చెప్పును తీసుకుని తన ఎడమ చెంపను కొట్టుకోసాగాడు. చంద్రబాబు అతనిని బలవంతంగా ఆపి... పాపారావు, నీకు ఏం దిగులొద్దు, మళ్లీ మన ప్రభుత్వమే వస్తుంది, ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ ఇంటికే వచ్చేలా ఏర్పాటు చేస్తాలే అని హామీ ఇచ్చాడు. కొద్దిదూరం వెళ్లగానే ఇసుకా వెంకట్రావ్ అనే అతను వచ్చి... అయ్యా, మీరు మళ్లీ ముఖ్యమంత్రి కావాలయ్యా, మీ పాలనలో మూడు లారీలు, ఆరు టిప్పర్లుగా అక్రమంగా ఇసుకను తోలుకుని భోగాపురం వద్ద పాతికెకరాల పొలం, మధురవాడలో ఒక కమర్షియల్ కాంప్లెక్స్ కొన్నాను. జగన్ వచ్చి మమ్మల్ని ఎండబెట్టాడు. మళ్లీ మీరే రావాలయ్యా అని చంద్రబాబు చేతులు పట్టుకుని గుంజసాగాడు... తమ్ముడూ ఖచ్చితంగా వస్తాను, చేతులు వదులు... చేతులు వదులు అని అంటున్నాడు... అప్పుడే ధబ్ మని సౌండ్ రావడంతో ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు చంద్రబాబు. తీరా చూస్తే ఆయన ఫ్లైట్‌లోనే ఉన్నాడు, విమానం అప్పుడే విశాఖ ఎయిర్‌పోర్టులో ల్యాండయ్యింది. ఎయిర్ హోస్టెస్ చేతులు రెండు చంద్రబాబు చేతుల్లో ఉన్నాయి... కలలో వున్న చంద్రబాబు ఎయిర్ హోస్టెస్ చేతులను పట్టుకుని కలవరించాడు. అప్పటిదాకా జరిగింది కల అని తెలుసుకోగానే చంద్రబాబు ఆమెకు సారీ చెప్పి, కలలోనే ఇలా వుంటే, ఇక ఒరిజినల్‌గా జనాదరణ ఏ రేంజ్‌లో వుంటుందోనని వూహించుకుంటూ ఎయిర్‌పోర్టు నుండి బయటకు వచ్చాడు. దూరంగా వున్న జనాన్ని చూస్తూ ఒక చేయి గాల్లోకి లేపి వూపాడు. అంతే ఆ చేతిలోకి కోడిగుడ్డు వచ్చి పడింది. రెండో చేతిని గాల్లోకి లేపగానే అరచేతిలోకి టమోటా వచ్చి పడింది. క్షణాల్లో చంద్రబాబు 'గో బ్యాక్' అని నానాదాలు చేస్తూ అక్కడున్న వేలాదిమంది ఆయన పైకి కోడిగుడ్లు, టమోటాలు విసరసా గారు... ఈ సంఘటనతో ఆయన ఉలిక్కిపడ్డాడు. అంతలో ఆయన సెల్‌ఫోన్ మోగింది. అంత టెన్షన్ వాతావరణం లోను ఫోన్ ఆన్ చేశాడు. అవతల నుండి భువనేశ్వరి... ఏవండీ, ఈరోజు విశాఖ లోని మన హెరిటేజ్ మాల్‌లో కోడిగుడ్లు, టమోటాలు విపరీతంగా కొన్నారంట... ఒకవేళ వాటిని మీ మీదకు విసిరితే మొహమాటపడకుండా అన్నింటిని సంచిలో వేసుకుని తేండి... మీకు సంచి ఇచ్చింది అందుకే! అవి తెస్తేనే సాయంత్రం మీకు కోడిగుడ్డు కూర.. లేదంటే పస్తే... అని ఫోన్ పెట్టేసింది. ఆ మాటలకు చంద్రబాబు మిడిగుడ్లు తేలేసాడు.

# భద్రతలో మేటి... శ్రీసిటీ

- ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం
- వేలాదిమంది కార్మికులతో కనులపండువగా వాకతాన్




ఈ నెల 4వ తేదీ జాతీయ భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశ్రామిక భద్రతలకు పిలుపు నిస్తూ శ్రీసిటీ హెచ్ఆర్ ఫోరమ్ శ్రీసిటీలో తలపెట్టిన 'ఇండస్ట్రియల్ సేఫ్టీ వాకతాన్ 2020' కార్యక్రమం విజయవంతమైది. అత్యధికంగ మహిళా కార్మికులతో, భద్రతా నినాదాల నడుమ ఎంతో ఉత్సాహంతో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం డిప్యూటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ శివ కుమార్‌రెడ్డి, సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముత్తురాజ్, శ్రీసిటీ డిఎస్పీ విమలకుమారి తదితరులు పాల్గొని జెండా ఊపి నడకను ప్రారంభించారు. సుమారు వంద పరిశ్రమల నుంచి వేలాది మంది ఉద్యోగులు 4 కిలోమీటర్ల మేరకు ఎంతో ఉత్సాహంగా నడక సాగించారు. దేశంలో ఇదే అతిపెద్ద పారిశ్రామిక భద్రత నడకగా శ్రీసిటీ వాకతాన్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకోవడం ఎంతో విశేషం. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సీనియర్ ప్రతినిధి వివేక్‌నాయర్ జడ్జిగా దీనిని నిర్ధారిస్తూ శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. శ్రీసిటీ వాకతాన్‌లో 5867 మంది పాల్గొనడం ఎంతో విశేషమన్నారు. ఈ ప్రత్యేక వాకతాన్ నిర్వహించడం ద్వారా శ్రీసిటీ కమ్యూనిటీ తన సత్తాను చాటిచెప్పిందని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. వాకతాన్‌లో అత్యధిక కార్మికులతో పాల్గొన్న రైజింగ్‌స్టార్ మొబైల్స్ ఇండియా లిమిటెడ్ (ఫాక్స్‌కాన్), పరిశ్రమకు ప్రథమస్థానం, ఇసుజు, ఐ-మాప్‌లు ద్వితీయ తృతీయ స్థానాలందుకున్నాయని అంటూ వారికి ప్రత్యేక ప్రశంసాపత్రాలను అందజేశారు.

## సిఎఫ్ఓ ఇండియా అవార్డు



జైపూర్‌లో గత నెల 29న జరిగిన వార్షిక సిఎఫ్ఓ లీడర్ షిప్ కాన్క్లేవ్‌లో శ్రీసిటీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సిఎఫ్ఒ) ఆర్.నాగరాజన్ ప్రతిష్ఠాత్మకమైన 'టాప్ 10 సీనియర్ ఫైనాన్స్ ప్రొఫెషనల్స్ ఇన్ ఇండియా' అవార్డును అందుకున్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి ఆర్థికసలహాదారు అరవింద్ మాయారాం చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. వరుసగా రెండవ ఏడాది శ్రీసిటీ సిఎఫ్ఓ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని పొందడం శ్రీసిటీకి ఎంతో గర్వకారణమన్నారు.

## కాలధర్మం

### మారంరెడ్డి మస్తాన్‌రెడ్డి



మారంరెడ్డి మస్తాన్‌రెడ్డి తన 70వ యేట మార్చి 2వ తేదీ తుదిశ్వాస విడిచారు. నెల్లూరుజిల్లా కొడవలూరు మండలం తాటాకులదిన్నె ఆయన స్వగ్రామం. మాగుంట సుబ్బరామరెడ్డి కుటుంబానికి మస్తాన్‌రెడ్డి బంధువు, మాగుంట శీనయ్యకి ఆత్మబంధువు. రాజకీయపరంగా, వ్యాపారపరంగా మాగుంట శీనయ్యకి వ్యక్తిగత సలహాదారుడిగానే కాకుండా, అన్ని విషయాలలోనూ సలహాలు, సూచనలు ఇచ్చేవాడు మస్తానయ్య.

'ఉదయం' పత్రిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా మస్తాన్‌రెడ్డి సుదీర్ఘకాలం పని చేశారు. మస్తానయ్యా అంటూ అందరూ ఆప్యాయంగా పిలుచుకునే ఆయన ఎప్పుడూ తెల్లదుస్తులతో మోహంపై చిరునవ్వుతో కనిపించేవాడు.

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం నాడు తుదిశ్వాస విడిచిన మస్తాన్‌రెడ్డికి భార్య ప్రతిభ, కుమారులు సురేష్, హరీష్ ఉన్నారు. మస్తానయ్య మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

### పచ్చా వేణుగోపాల్



నెల్లూరు, పొదలకూరురోడ్డులోని లేక్‌వ్యూ కాలనీకి చెందిన సివిల్ కాంట్రాక్టర్ పచ్చా వేణుగోపాల్ ఫిబ్రవరి 28వ తేదీన తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 48 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్ళుగా బెంగుళూరులోనే ఆయన కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతికి నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## కావలిలో కేంద్రీయ విద్యాలయం

నెల్లూరు జిల్లా కావలిలో వచ్చే విద్యాసంవత్సరం నుండి కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ యంవి శేషగిరి బాబు తెలిపారు.

ఈనెల 1న ఆయన కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు కావలిలోని జెడ్పీ హైస్కూలును పరిశీలించామని, కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు నిబంధనల మేరకు అవసరమైన స్థలం ఈ స్కూల్లో ఉందని తెలిపారు. ఇక్కడ కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే పట్టణంతో పాటు చుట్టుప్రక్కల మండలాల్లోని పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందన్నారు. నివేదికను హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ అధికారులకు అందజేస్తామన్నారు. తాత్కాలికంగా జెడ్పీ హైస్కూల్లోని భవనాల్లో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించి అనంతరం కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసి పూర్తి స్థాయిలో అవసరమైన భవనాలను నిర్మించనుందని తెలిపారు.

ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలి విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో గత ఐదేళ్ళుగా అధికారులను కలుస్తున్నానన్నారు. కావలిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆదాల ప్రభాకర రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి కృషి చేశారని తెలిపారు.



### హైలెవల్ కెనాల్ పనులు

## హైస్పీడ్‌తో చేయండి

- ఇరిగేషన్ అధికారులతో మంత్రి గౌతంరెడ్డి

జిల్లాలోని మెట్టప్రాంతానికి జీవనాధారమైన సోమశిల హైలెవల్ కెనాల్ పనులను హైస్పీడ్‌తో పూర్తి చేయాలని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించాడు. ఇటీవల నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబుతో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ మార్చి 15కల్లా సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 పనులను పూర్తి చేయాలంటూ డెడ్‌లైన్ విధించారు. ఫేజ్-2 పనులను కూడా త్వరితగతిన చేపట్టాలని ఆదేశించాడు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.వినోద్‌కుమార్, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ ఎం.వి.నాగేశ్వరరావు, ఆత్మకూరు ఆర్డీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వి.పి.ఆర్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం




ఫిబ్రవరి 28న వి.పి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని వి.పి.ఆర్ విద్య పాఠశాల మరియు కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంను చాలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరూ వారియొక్క ప్రయోగాలను ఎంతో ఉత్సాహంగా ప్రదర్శించారు. మ్యాజిక్ మిల్క్, కలర్‌ఫుల్ క్యాండీ సర్కిల్స్, ప్రొజెక్టర్, సపరేషన్ ఆఫ్ పెప్పర్, ఆర్టిఫిషల్ లాంప్స్, సిల్క్ ట్రేడ్ ఫ్రమ్ కుకూన్స్, కార్ విత్ సూపర్ ఫాస్ట్ ట్రావెల్లింగ్ కలర్స్, ఫ్లాంటింగ్ లాంప్స్ ఇన్ వాటర్, వాటర్ టోర్నడో, వాటర్ బెలూన్, కలర్డ్ ఫ్లావర్..ఇంకా అనేక శాస్త్ర సాంకేతిక విషయాలను విద్యార్థులు విశ్లేషణాత్మకంగా వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వి.పి.ఆర్ ఫౌండేషన్ సి.ఈ.ఓ ఆచార్య వి.నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు జాతీయ సైన్స్ దినోత్సవం వంటి కార్యక్రమాలు దోహదపడుతాయని, వారి ప్రయోగాలు దేశ భవిష్యత్తుకు బాటలు వేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ వి.టి శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డా. ఆర్‌హెచ్ కళా పాల్గొన్నారు.

## డాక్టర్ సన్నీష్‌రెడ్డికి 'నెఫ్రాలజీ'లో గోల్డ్‌మెడల్



నెల్లూరు దర్గామిట్టకు చెందిన న్యాయవాది అనపల్లి మస్తాన్‌రెడ్డి కుమారుడు, ప్రముఖ వైద్యుడు అనపల్లి సన్నీష్‌రెడ్డి తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రి నుంచి నెఫ్రాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్ అందుకున్నందుకు నెల్లూరు రైల్వే చీఫ్ టికెట్ ఇన్స్‌పెక్టర్ ఎస్‌డి సాగర్ ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. గత నెల 29న జరిగిన స్విమ్స్ ఆసుపత్రి 10వ స్నాతకోత్సవంలో టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకోవడం నెల్లూరీయులకెంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. సన్నీష్‌రెడ్డి వైద్యవృత్తిలో మరెంతగానో ఉన్నతస్థాయికి ఎదిగి రోగులకు మరింతగా వైద్యసేవలందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన విశ్రాంత ఎఎస్పీ వెంకటరామిరెడ్డి, నరసారెడ్డి, మధుసూదనరెడ్డి, ప్రసన్నకుమార్, జనార్దనరెడ్డిలు సన్నీష్‌రెడ్డికి తమ అభినందనలు తెలిపారు.

## 'దిశ'పై అవగాహన

నెల్లూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాభారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు 'దిశ, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆమేరకు ఆమె ఈనెల 3న నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాల ప్రాంగణంలో ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ కాలేజీలోని సుమారు 2 వందలమంది విద్యార్థినులకు ఈ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపదసమయాల్లో రక్షణ పొందాలని సూచించారు. డికెడబ్ల్యు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తానయ్య, అర్బన్ సిడిపిఒ సత్యకుమారి, డిసిపిఒ సురేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీలత, ప్రమీలమ్మ, అరుణ పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న పోలీసులు

అర్ధరాత్రి సమయంలో పురిటినొప్పులు అధికం కావడంతో ఆ తల్లి ఎంతో బాధ పడుతుంటే, ఆమెను ఆసుపత్రికి తీసుకు వెళ్ళేందుకు రోడ్డుపైకి తీసుకువచ్చాడు ఆమె భర్త. అయితే అర్ధరాత్రి వేళ ఎంతకీ వాహనాలు రాకపోవడంతో రోడ్డుపైనే నిలబడి ఎంతో అవస్థపడుతుండగా, రాత్రి గస్తీలో ఉన్న చిన్నబజారు ఎస్ఐ రవినాయక్ ఆ పరిస్థితి గమనించి వెంటనే వారిని తమ వాహనంలో తీసుకువచ్చి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. సకాలంలో ఆ నిండు గర్భిణిని ఆసుపత్రిలో చేర్చడంతో ఆమె పండంటి పాపకు జన్మనిచ్చింది. దీంతో మన్సూర్‌నగర్‌కు చెందిన అనిల్, భవాని అనే ఆ దంపతులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆపదలో ఆదుకుని మానవత్వం చాటుకున్న బాలాజీనగర్ ఎస్ఐకి, పోలీసులకు వారు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేశారు. నిండు గర్భిణి అవస్థలను గమ నించి, వారిని ఆసుపత్రికి చేర్చి మానవత్వం చాటుకున్న ఆ ఎస్ఐని, పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

### పాత్రికేయ రంగానికి దిక్సూచి...

## పొత్తూరి వెంకటేశ్వరరావు.. ఇక లేరు



పత్రికా రంగంలో దాదాపు అయిదు దశాబ్దాల పాటు అత్యుత్తమ సేవలందించిన సీనియర్ పాత్రికేయుడు, ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మెన్ పొత్తూరి వెంకటేశ్వరరావు(86) ఈనెల 5వతేది గురువారం కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన అస్వస్థతో ఉన్నారు. 1934 ఫిబ్రవరి 8వ తేదిన గుంటూరు జిల్లా పొత్తూరులో జన్మించిన ఆయన 1957లో ఆంధ్ర జనతా పత్రికతో పాత్రికేయ ప్రస్థానం ప్రారంభించారు. పలు పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. ముఖ్యంగా ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ దినపత్రికల్లో పనిచేస్తూ పాత్రికేయరంగానికి దిక్సూచిగా ఉంటూ ఎందరికో స్ఫూర్తినిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మెన్‌గా ఆయన గురుతరమైన బాధ్యతలు నిర్వహించారు.

2000వ సంవత్సరంలో ఆయన రచించిన 'నాటి పత్రికల మేటి విలువలు' పుస్తకంతో పాటు 2001లో రచించిన 'చింతన', 'చిరస్మరణీయులు' పుస్తకాలు ఆయన రచనా పటిమకు నిదర్శనాలు. ఆ పుస్తకాలు పత్రికారంగంలోనే కాక పాఠకలోకంలో కూడా ఆయనకు మరింత మంచిపేరు తెచ్చిపెట్టాయి.ఆయన మృతితో పత్రికా రంగం ఒక పెద్దదిక్కును కోల్పోయినట్లయ్యింది.

## ఎల్‌ఏపిలో ఈఎస్ఐ వైద్యశిబిరం




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

గూడూరు శారదా నగర్‌లోని ఎల్‌ఏపి పాఠశాలలో ఈనెల 1న ఈఎస్ఐ ఆధ్వర్యంలో వైద్యశిబిరం, అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికుల పిల్లలకు మెడికల్ సీట్లలో కూడా కోటా కేటాయిస్తున్నారన్నారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ బి.శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్లు పద్మజ, కిషోర్, శ్రావణ్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఓంకారరావు, కల్యాణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొండబిట్రగుంట బ్రహ్మోత్సవాలు

కొండ బిట్రగుంటలో అంగరంగవైభవంగా జరుగుతున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు భక్తజనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు. బిలకూట క్షేత్రంగా ప్రసిద్ధిచెందిన ఈ ఆలయంలో కొలువుదీరి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కల్పవృక్షంగా ప్రసిద్ధి. ఈనెల 4వ తేదీ ఎంతో శుభప్రదమైన ఫాల్గుణ శుద్ధ దశమినుంచి ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈనెల 10వతేది మంగళవారం బహుళ పాడ్యమి రోజు వరకు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. 4వ తేది ఉదయం గిరిప్రదక్షిణ ప్రారంభమై, రాత్రి 9 గంటలకు బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమం ఎంతో కనువిందుగా జరిగింది.

ఈ ఉత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తుం డడంతో కొండ బిట్రగుంట భక్తుల రద్దీతో క్రిక్కిరిసిపోతోంది. స్వామివారి కొయ్యరథం ఇటీవల కాలిపోవడంతో లక్ష రూపాయల వ్యయంతో పూలరథోత్సవం ఏర్పాటుచేసి స్వామివారికి శోభాయమానంగా రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు, అధికారులు కలిసి పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేస్తున్నారు. ఆలయ కమిటీ ఛైర్మెన్ శ్రీరామ్ మాల్యాద్రి, కార్యనిర్వాహణాధికారి మల్లికార్జునరెడ్డి తదితరుల పర్యవేక్షణలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

## గురువును సత్కరించిన శిష్యుడు

ఎంతో పూజ్యభావంతో తన గురువును సత్కరించి ఆ శిష్యుడు అందరి ప్రశంసలను అందుకున్నాడు. నెల్లూరు నగరంలోని ఆదిత్య డిగ్రీ–పీజీ కళాశాల వ్యవస్థాపకుడు..తన గురువైన ఆచార్య ఆదిత్యను ఈనెల 3న రజకసంఘం ఆలిండియా సెక్రటరీ, జిల్లా సంఘం అధ్యక్షుడు చదలవాడ రమణయ్య ఘనంగా సన్మానించారు. నగరంలోని ఆదిత్య విద్యాసంస్థల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రమణయ్య పాల్గొని తమ గురువు ఆచార్య ఆదిత్య ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ దక్షిణేశ్వర్‌లోని కాళికా దేవాలయాన్ని సందర్శించి, అమ్మవారి ప్రసాదాలను తీసుకువచ్చి గురువుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కె.అంకయ్య, ఏ.ఓ నాగిరెడ్డి, విజయరామచౌదరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## దశ.. 'దిశ'గా ఆంధ్రా

(మొదటి పేజీ తరువాయి)

2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణకు బాటలు వేస్తూ విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా, అమరావతిని చట్టసభల రాజధానిగా, కర్నూలును న్యాయ వ్యవస్థ రాజధానిగా తెరమీదకు తెచ్చింది. దీని మూలంగా మూడు ప్రాంతాల అభివృద్ధికి మార్గం ఏర్పరచినట్లయ్యింది. మూడు ప్రాంతాల ప్రజలను సంతోష పరిచినట్లయ్యింది.

ఈ అభివృద్ధి వికేంద్రీకరణ పాలసీనే ఇప్పుడు దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి. అలాగే హైదరాబాద్‌లో దిశ సంఘటన చోటుచేసుకున్నాక, మహిళలపై అత్యాచారాలు, హత్యలు వంటి నేరాలకు పాల్పడితే నిందితులకు 28రోజులలోగా శిక్ష పడేలా వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన 'దిశ' చట్టం కూడా పలు రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. ఇప్పటికే మహారాష్ట్ర 'దిశ' చట్టం అమలుపై అధ్యయనం చేస్తోంది. కేవలం 9 నెలల పాలనలోనే జగన్మోహన్‌రెడ్డి ఒక ట్రెండ్ సృష్టించాడు. పరిపాలనపై తనదైన ముద్రను వేసుకుంటూ పక్క రాష్ట్రాల సీఎంలనే తనవైపు చూసేలా చేస్తున్నాడు.

జగన్ నిర్ణయాలు, పరిపాలనలో వేగం చూసి సీనియర్ సీఎంలే ముక్కున వేలేసుకోవడం కాదు... ఆయనను అనుసరించడానికి కూడా సిద్ధమవుతున్నారు.

ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలు చూస్తే దేశంలోనే ఈరోజు ఏపి అగ్రస్థానంలో వుంది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్‌ల కోసం అధికారుల వద్దకు పరుగులు తీసే పరిస్థితి పోయి, ఉద్యోగులు ఇళ్లకు వచ్చి స్వయంగా పింఛన్‌లు అందించే స్థితి వచ్చింది. తాను ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన 'నవరత్నాలు' అమలుకు జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శప్రాయంగా మారుతోంది.

అన్నింటికి మించి వైయస్ జగన్ సర్కార్ అనుసరిస్తున్న పరిపాలనా వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ బాటలో మరికొన్ని రాష్ట్రాలు నడుస్తున్నాయి. కర్నాటక, జార్ఖండ్, ఉత్తరాఖండ్ వంటి రాష్ట్రాలు పరిపాలనా వికేంద్రీకరణ వైపుగా అడుగులు వేస్తున్నాయి.

అభివృద్ధి వికేంద్రీకరణ లేకపోతే ప్రాంతాలవారీగా ఎలాంటి నష్టం జరుగుతుందనేదానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనే ఒక ఉదాహరణ. దాదాపు ఆరు దశాబ్దాల పాటు ఉమ్మడి రాష్ట్ర నిధులతో అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్ నగరాన్ని ఏపి విభజన ద్వారా తెలంగాణ తన్నుకు పోవడం తెలిసిందే! ఈ ఆరు దశాబ్దాల కాలంలో హైదరాబాద్‌కు సమానంగా రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాలలో రెండు నగరాలను అభివృద్ధి చేసుంటే హైదరాబాద్‌ను వదులుకున్నందుకు పెద్దగా బాధవుండేది కాదు.

కాని, ఈ గుణపాఠం నుండి గత ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏం తెలుసుకున్నాడో తెలియదు కాని, గత ఆంధ్రా పాలకులు చేసిన తప్పునే పునరావృతం చేశాడు. అమరావతి చుట్టూ అభివృద్ధిని కేంద్రీకృతం చేయాలనుకున్నాడు. అయితే తన 5ఏళ్ళ పాలనలో ఆయన దానిని అసంపూర్తిగా మిగల్చడం వల్ల రాష్ట్రానికి మేలే జరిగింది.

## సర్కార్ సిద్ధం?

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 3వ తేదీ నుండి ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షలు ప్రారంభం కాగా, 23వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు మొదలవుతాయి. ఇవేకాక వరుసబెట్టి డిగ్రీ, ఎంసెట్, లాసెట్... ఇలా అన్ని రకాల పరీక్షల సీజన్ ఇది. విద్యార్థులపై ఎంతో మానసిక ఒత్తిడి వుంటుంది. ముఖ్యంగా వాళ్ళ చదువులకు భంగం కలిగించకూడదు... ఎందుకంటే ఇది లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అంశం.

అయితే ఈ పరీక్షల కాలంలోనే ప్రభుత్వం కూడా ఎన్నికల పరీక్షలకు సిద్ధమవుతుండడం అనేక విమర్శలకు తావిస్తోంది. ఎన్నికల కమిషన్ కూడా విద్యార్థుల పరీక్షల తేదీలను బట్టే ఎన్నికల తేదీలను ఖరారు చేస్తుంటుంది. విద్యార్థుల పరీక్షలకు కేంద్ర ఎన్నికల సంఘమే అంతటి ప్రాధాన్యతనిస్తుంది. పరీక్షల టైంలో ఎలక్షన్‌లు అంటే స్కూల్లలో రచ్చరచ్చగా ఉంటుంది. ఉపాధ్యాయులను, స్కూళ్లను ఎన్నికల విధులకు వాడుకోవాల్సి ఉంటుంది. ఇదంతా కూడా విద్యార్థుల చదువులకు భంగం కలిగించడమే!

మంచి పరీక్షల కాలంలో ప్రభుత్వం స్థానిక ఎన్నికల తేదీలను ప్రకటించింది. మార్చి నెలలోపు ఎన్నికలు పూర్తి చేయకపోతే రాష్ట్రానికి 14వ ఆర్థిక సంఘం ద్వారా రావాల్సిన నిధులు రావు... అందుకే పరీక్షల కాలంలోనే ఎన్నికల పరీక్షలకు సిద్ధమవుతూ... విద్యార్థులకు అగ్నిపరీక్ష పెడుతోంది.

### వార్ వన్‌సైడేనా?

స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు ఇచ్చిన తీర్పుతో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో ఒక అంకం ముగిసినట్లయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పెంచిన రిజర్వేషన్లను తగ్గిస్తూ, పాత రిజర్వేషన్ల పద్ధతిలోనే స్థానిక సమరానికి సన్నద్ధమవుతోంది.

స్థానిక ఎన్నికలలో వార్ వన్‌సైడ్‌గా వుండాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే తన పార్టీ శ్రేణులకు సంకేతాలు పంపాడు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఆ స్థాయి ఫలితాల కోసమే పోరాటం మొదలుపెట్టారు. అన్ని స్థానిక సంస్థల్లోనూ 90శాతం వాటా వైసిపిదే కావాలని జగన్ ఆలోచన.

పరిస్థితులు కూడా అందుకు తగ్గట్లే వున్నాయి. మద్యం, నగదు రహిత ఎన్నికలు జరపాలనేదే సీఎం ఆలోచన. అందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా ఎన్నికల నిబంధనలు కఠినతరం చేస్తోంది. మామూలుగానే స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి ప్రతిపక్షాల నుండి పెద్దగా ఆసక్తి కనపరచడం లేదు. రాష్ట్రంలో వైసిపి ఇంకో నాలుగేళ్లకు పైగా అధికారంలో వుంటుంది. తెలుగుదేశం నుండి తాము గెలిచినా ఒరిగేదేమీ వుండదని, డబ్బులు దండగనే భావంతో వున్నారు. అదీగాక స్థానిక సంస్థలు ఒక్క సర్పంచ్, జడ్పీటీసీ తప్పితే మేయర్, మున్సిపల్ ఛైర్మెన్, జడ్పీ ఛైర్మెన్, ఎంపీపీలను పరోక్షంగా ఎన్నుకుంటారు. ఈ ఎన్నికలపై అధికార పార్టీ ప్రభావం బాగానే వుంటుంది. కాబట్టి స్థానిక ఎన్నికలలో ప్రతిపక్షాల నుండి అధికార పక్షానికి పెద్దగా పోటీ వుండక పోవచ్చు. జగన్మోహన్‌రెడ్డి ఆశిస్తున్నట్లు వార్ వన్‌సైడే కావచ్చు కూడా!



మారంరెడ్డి మస్తాన్‌రెడ్డి

10.08.1949 02.03.2020

# ఉత్తరక్రియలు

మా ఇంటి దైవం, మా పెద్దదిక్కు

## మారంరెడ్డి మస్తాన్‌రెడ్డి గారు

తే.02.03.2020ది పరమపదించారు.

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య: మారంరెడ్డి ప్రతిభ

కుమారులు - కోడళ్ళు

మారంరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి - మారంరెడ్డి స్వప్న

మారంరెడ్డి హరీష్‌కుమార్‌రెడ్డి - మారంరెడ్డి స్రవంతి

**వారి ఉత్తరక్రియలు:**

తే. 12.03.2020ది మధ్యాహ్నం 12గంటలకు హైదరాబాదు, హైటెక్‌సిటి, మాదాపూర్‌లోని "హోటల్ ఆవాస" నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# 19వ వర్ధంతి

పూజ్యులు

## స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు

నిర్యాణం: 06.03.2001

స్వర్గస్తులై 06.03.2020 నాటికి
19 సంవత్సరాలు నిండుతాయి.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు:

**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**

రాజ్యసభ సభ్యులు



Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com